ఆ సందర్భంలో రవిచంద్ర చేత ఇలా పలికిస్తారు రచయిత్రి.

"నువ్వు రచయితగా నా అభిమానివి కాకపోవచ్చు. కానీ నన్నుమితంగా అభిమానించే దానివి కాబట్టే మారుపేరుతో ఉత్తరం రాసి నాకుత్సాహం కలిగించాలని తాపత్రయపడ్డావు. అందుకే నేను నా అభిమానినే పెళ్ళి చేసుకుంటానని గట్టిగా నీకు చెప్పగలిగాను. రచయితిగా కూడా నీ అభిమానాన్ని పొందటానికి కృషి చేస్తాను"[30] రచయితకు ప్రశంసలు ఉత్సాహాన్ని కలిగిస్తాయి. కానీ నిజాయితీగా చేసే విమర్శలే మంచి రచయితగా ఎదగటానికి ఉపయోగపడతాయని ఈ కథ ద్వారా తెలియజేసారు రచయిత్రి. నిజమైన అభిమాని కథలో తనకి నచ్చిన అంశాలతో పాటు, నచ్చని అంశాలను కూడా చెప్పగలగాలి. అటువంటి అభిమానిని సంపాదించుకున్నప్పుడు రచయిత సఫలీకృతుడైనట్లే.

కథలో రచయిత్రి ప్రణయాన్ని ఎక్కడా వర్ణించనప్పటికి రవిచంద్ర, సురేఖలు ఒకరిపట్ల ఇంకొకరు చూపే ప్రేమానురాగాలు పాఠకుడికి ఒక నిర్వచనీయ అనుభూతి కలుగుతుంది. ప్రణయ సంబంధ కథలు తర్వాత చెప్పుకోదగ్గవి మానవీయవిలువలకు సంబధించిన కథలు.

## 2.3 మానవీయ విలువలకు సంబంధించిన కథలు :

మానవీయ విలువలు అంతకంతకు అడుగంటుకుపోతున్నాయి. మానవత్వం లేని సమాజం త్వరలో చూడబోతున్నాం. మానవత్వం లేకపోవటం వల్ల ఎన్ని అరాచకాలు, ఎన్ని హత్యలు జరుగుతున్నాయి. మనిషి ఏనాడైతే నైతికతను కోల్పోయాడో ఆనాడే మానవీయత దెబ్బతింది. శాస్త్ర, సాంకేతిక, విద్య, వైజ్ఞానిక రంగాల్లో దేశం ఎంత అభివృద్ధి చెందుతున్నా మానవీయ విలువలు అంతవేగంగా కనుమరుగవుతున్నాయి. దానికి కారణం ప్రజల్లో నీతి, న్యాయం, ధర్మం, శాంతి, సహకారం మొదలైనవన్నీ కనుమరుగవుతున్నాయి. ఆదరణ లేదు. అసాంఘిక స్థితి రాజ్యమేలుతుంది. అటువంటి అంశాలను ప్రధానాంశాలుగా చేసుకుని రచయిత్రి గోగినేనిమణి కొన్ని కథలు రాశారు. వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే మానవీయ విలువలు తెలుస్తాయి.

### 2.3.1 కెనడా మామయ్య :

రచయిత్రి స్వయంగా ఈ కథలో ఒక పాత్రగా లీనమై కథను నడిపించారు. కథంతా కెనడాలో ఉండే మామయ్య చుట్టూనే నడుస్తుంది. తల్లిపాత్ర ద్వారా ఆమె తమ్ముడైన

30. మనసునమల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 128

ఆనంద్ (కెనడా మామయ్య) సంగతులు తెలుసుకున్న పిల్లలు అంతలా ఎదగాలనుకుంటారు. చివరకు మానవీయ విలువలు, బంధాలు, అనుబంధాలను పట్టించుకోని అటువంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకోకూడదని కథాంతంలో నందూ పాత్ర ద్వారా తెలియజేస్తారు రచయిత్రి.

కథలో కెనడా మామయ్యను పరిచయం చేస్తూ "అమ్మకి ఒక్కడే తమ్ముడు. పేరు ఆనంద్. క్లాస్‌లోనూ, ఆటల్లోనూ ఫస్టున ఉండేవాడట! ఆ వీధి పిల్లలందరికీ నాయకుడిలా ఉండి వాళ్ళింటముందు నాటకాలు వేయించడం, పద్యాల పోటీలు నిర్వహించడం. ఇవన్నీ సరదాగా చేస్తు ఉండేవాడట... ఎప్పుడూ ఏవో చిలిపి పనులు చేస్తూ పెద్దవాళ్లను కూడా నవ్విస్తూ ఉండేవాడట. చిన్న పిల్లలంటే వాడికి ఎంతో ఇష్టం అంటూ అమ్మ మామయ్యని గురించి చెబుతూ ఉండేది."[31]

ఆ మాటలు విన్న పిల్లలకు మామయ్యంటే హీరోలా భావించేవారు. పిల్లలకు తెలియకుండానే అతనంటే ఆరాధానాభావం, ఆత్మీయత పెరిగిపోతాయి. ఆనంద్ కెనడా వెళ్ళిన అయిదేళ్ళకు ఇండియా వస్తాడు. తమ ఇంటికి వస్తాడని పిల్లలు సంతోషానికి అవధులు ఉండవు. తమ స్నేహితులమధ్య దండోరా వేస్తారు. చిన్నవాడు నందకిషోర్ మరింత గొప్పగా చెప్పేవాడు. ఏవేవో ఊహాగానాలు చేస్తాడు. మామయ్య ఎప్పుడొస్తాడోనని రోజుల్ని లెక్క పెట్టుకుంటూ ఉత్సాహంగా ఎదురుచూస్తారు. అతను వచ్చే రోజు పాఠశాలకు వెళ్ళకుండా ఇంటిదగ్గర ఉండిపోతామంటే తల్లి మందలిస్తే చిన్నబుచ్చుకుని వెళతారు.

ఓ రోజు సాయంకాలం మూడు గంటల సమయంలో ఆనంద్, అతని భార్య, మామలు, ఇద్దరు స్నేహితులు కలిసి వస్తారు. ఆ ఊరిలో ఏదో పరిశ్రమ పెట్టడం కోసం స్థలం కొనే ప్రయత్నంలో అక్కడికి వచ్చినట్లు చెబుతారు. ఒక గంటసేపు కూర్చుని హడావుడిగా వెళ్ళిపోతారు. రాక రాక వచ్చిన తమ్ముడు నాలుగు రోజులు ఉంటాడనుకొని రకరకాల పిండివంటలు చేస్తుంది అతని అక్క. ఎవ్వరు ఏమి తినకుండానే వెళ్ళిపోతారు. పాఠశాల నుండి తిరిగి వచ్చినందుకు మామయ్య కారు వెళ్ళిపోవడం గమనిస్తాడు. ఒక్క క్షణం అయోమయంగా చూస్తూ నిలడిపోతాడు. తను వచ్చేవరకు ఉండలేదని పెద్దగా ఏడుస్తాడు. భోజనం చేయకుండానే నిద్రపోతాడు. అతనికి కలిగిన ఆశాభంగం తక్కువేమి కాదు. ఒక్కోసారి జీవితంలో చాలా చిన్నవిగా అనిపించే సంఘటనలే మనసుపై ఎంతగానో ప్రభావితం చేస్తాయి. ఆ తర్వాత ఆనంద్ మళ్ళీ రెండు మూడు సార్లు వచ్చినా వారిని

31. మనసునమల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 26

కలవడానికి రాడు. క్రమక్రమంగా ఆనంద్ ఆస్తిపాస్తులు పెరిగిపోసాగుతాయి. ఆ సంగతులన్నీ వేరే వ్యక్తుల ద్వారా తెలుసుకోవడం తప్ప తాను స్వయంగా వచ్చి చెప్పింది లేదు. అతని మాటలు క్రమక్రమంగా తగ్గుతాయి. పిల్లలకి అతనంటే ప్రేమ తగ్గి కోపం పెరుగుతుంది. తల్లిని పదే పదే అడుగుతారు మామయ్య ఎందుకు రావడం లేదని. అతడికి అభిమానాలు, ఆప్యాయతలు ఏమి ఉండవు అని రాజీ అంటుంది. తమ్ముడిని తలచుకుంటూ ఆమె పరధ్యానంగా ఉండిపోతుంది.

తర్వాత కొన్నాళ్ళకి ఆనంద్ వస్తున్నాడని తెలిసి అతడిని కొన్ని ప్రశ్నలడగాలని నిశ్చయించుకొని రిహార్సల్స్ వేస్తారు పిల్లలు. రాజీ, మంజులు ఈ విధంగా ప్రశ్నలు వేసుకొని సమాధానాలు చెబుతారు.

అంతస్థులు తారతమ్యం అయిన వాళ్ళ మధ్య రాకపోకలకి కూడా అంతరాయం కలిగిస్తుంది ఎందువలన? అని ప్రశ్నిస్తుంది రాజీ. మంజు ఆ ప్రశ్నకు సమాధానంగా ఇలా చెబుతుంది. అంతస్తులనేవి రాకపోకలకి అడ్డువస్తాయంటే నేనంగీకరించను. అనేక కారణాలు ఉంటాయి. నెలల బిడ్డ తల్లిని ఒక క్షణం కూడా వదిలి ఉండటానికి ఇష్టపడదు. వయసు వచ్చే కొద్దీ, స్నేహితులు, ఆటలు, స్కూలు వీటన్నింటితో ప్రపంచం పెద్దదవుతుంది. తల్లికి కొంచెం దూరమవుతాడు. అంతమాత్రాన అభిమానం లేదని కాదు కదా! ఒక ఇంట్లో పుట్టి పెరిగిన వాళ్ళ మధ్య కూడా దూరం క్రమేపి పెరగటం సహజం. సంసారం, ఉద్యోగం, బాధ్యతలు అన్నీ వేరయ్యాక తరచు కలుసుకోవటం కుదరనంతమాత్రాన అభిమానాలు లేకుండా పోతాయన్నది నిజం కాదు అని సమాధానమిస్తుంది.

మనసుంటే మార్గముంటుంది కదా అని రాజీ ప్రశ్నిస్తుంది. నిజమే, కానీ మనసెంతగా ఉన్నా మార్గాలన్నీ మూసకుపోయిన సందర్భాలు కూడా ఉంటాయి అని చిరునవ్వుతో మంజు అంటుంది.

ఎదుటివాళ్ళ దృక్పథం నుండి కూడా మనం ఆలోచించగలిగితే, సగం సమస్యలు పరిష్కారమవుతాయి. మరునాడు ఆనంద్ కుటుంబం వస్తుందని ఇల్లుని అందంగా సర్దేసి వేచిచూస్తారు. ఆనంద్ కుటుంబం గుడిలో కళ్యాణం చేయడానికి వచ్చినట్లు తెలుసుకోవడానికి నందకిషోర్ మైలున్నర దూరం సైకిలు తొక్కుకుంటూ వెళ్ళి చూసి వస్తారు. ఆనంద్ రాక కోసం అంతా ఆతురతగా చూస్తుంటారు. వాళ్ళు అటు నుండి అటే వెళ్ళిన సంగతి పొరుగింటి పిన్ని చెబితే తెలుస్తుంది. కొందరు తమ ప్రవర్తన ద్వారా ఎలా నేడుచుకోవాలో తెలియజేస్తారు.

మరికొందరు ఎలా ప్రవర్తించకూడదో తెలియజేస్తారు. మానవ జీవితాన్ని మధురతరం, ఐశ్వర్యవంతమూ చేయగలిగేవి మమకారం, ప్రేమానురాగాలే.

**సమీక్ష :**

నానాటికి మనుషుల మధ్య అనుబంధాలు, రక్త సంబంధాలు ఎలా తెగిపోతున్నాయో రచయిత్రి ఈ కథ ద్వారా తెలియజేశారు. మానవీయ విలువలు దిగజారిపోతున్న ఈ సమాజానికి ఒక మేలుకొలుపుగా ఉంది ఈ కథ. కథలో తల్లి పాత్రను ఎంతో పరిణతి గల పాత్రగా తీర్చిదిద్దారు రచయిత్రి. ఆ తల్లికి పెద్దకూతురు పాత్రను రచయిత్రి స్వయంగా ఉత్తమ పురుషలో కొనసాగించారు. రచయిత్రి కథను స్వగతంలా నడిపించారు. కెనడా మామయ్య వస్తున్నాడని కబురు అందగానే రచయిత్రి తల్లి తమ్ముడి కోసం పిండివంటలు చేయడంలో నిమగ్నమై ఉంటుంది. అది చూసిన రచయిత్రి ఆరోగ్యం బాగోలేక పోయినా ఎందుకు ఇంత హైరానా పడుతున్నావని తల్లిని సున్నితంగా మందలిస్తుంది. తమ్ముడికి సున్నుండలంటే ఇష్టమని, మరలా ఎన్నేళ్ళకు వస్తాడోనని నుదుటకు పట్టిన చెమటను చీరకొంగుతో అద్దుకుంటూ అంటుంది. ఆ క్షణంలో తల్లి ముఖం ఆనందంతో అలసట లేకుండా తళతళలాడటం గమనిస్తుంది రచయిత్రి. తమ్ముడిమీద ప్రేమ ఒక అక్కకు ఎంతలా ఉంటుందో ఈ సన్నివేశంలో కళ్ళకు కట్టినట్లు చూపారు రచయిత్రి.

తల్లి తన బంధువర్గంలోనే అందరి పేర్లను గుర్తు చేసుకుంటూ చిన్నప్పటి సంగతులను చెబుతుంటే వింతగా అనిపిస్తుంది రచయిత్రికి. "ఆ ఆపేక్షలు, అభిమానాలు అన్నీ ఆ తరం మనుష్యులతోనే తరలి వెళ్ళిపోయాయి."[32] అని తల్లి మిత్రచేత అనిపించటం ద్వారా బంధాలు, బంధుత్వాలు నానాటికి ఎలా దిగజారిపోతున్నాయో తెలుస్తుంది. మానవీయ విలువలకు అర్థం లేకుండా పోతున్నాయి.

రచయిత్రి తల్లి నిత్యం తన తమ్ముడు (కెనడా మామయ్య) కబుర్లు తన పిల్లలకు చెబుతుండం వల్ల అతని మాటలు, అతని చేతలు వాళ్ళకు సుపరిచితమే.

కథలో ఒకానొక సందర్భంలో పాతకాలం నాటి ఉమ్మడి కుటుంబాలు ఉండే ఇంటిని వర్ణిస్తారు రచయిత్రి. ఆ వర్ణనతో నాటి ఇండ్లను కళ్ళకు కట్టినట్లు చూపారు.

.................................................................................................

**32. మనసునమల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 25**

"విశాలమైన ఖాళీ స్థలంలో, ఎత్తైన ప్రహరీ గోడల మధ్య, పెద్దవసారాతో వుండే మండువా లోగిలి."[33] పెద్దలంటే భక్తి, భయంవల్ల నాడు ఉమ్మడి కుటుంబంలో అందరు కలసిమెలసి ఉండేవారు. అంతమంది కలసి ఉండడం నేటితరం వారికి గొప్ప విషయంగా అన్పిస్తుంది. మధురమైన బాల్యస్మృతులు మనసు అరలో దాగి ఉండే నిధి నిక్షేపాలు లాంటిది అంటారు రచయిత్రి. నేటి తరానికి అటువంటి స్మృతులు ఉండట్లేదని బాధపడతారు. రచయిత్రి కథలో పాతకాలం నాటి చలికాలపు రోజులను గుర్తు చేసుకుంటూ కార్తికమాసం నదీ స్నానాలు, అరటి దొప్పల్లో వెలిగించిన ఆవు నేతి దీపాలు, గోదావరి అలలుపై ఆ దీపాలు కదిలే రమణీయ దృశ్యాలను వర్ణిస్తారు. నేడు ఆ అనుభవాలు ఏ కొందరికో తప్ప మిగిలిన వారికి లేవని అంటారు రచయిత్రి.

విదేశాలకు వెళ్ళి ధనవ్యామోహంలో పడిన మనుషులు తమ స్వంతవారిని మరిచి పోతున్నారని కెనడా మామయ్య పాత్ర ద్వారా తెలియజేశారు రచయిత్రి. తనని ఎంతగానో అభిమానించే అక్కను కలవడానికి కూడా సమయం లేనంతవాడిగా వాళ్ళు ఊరు వచ్చి కూడా కనీసం పలకరించడానికి కూడా వెళ్ళడు. తమ్ముడ వస్తాడేమోనని ఎదురు చూసిన అక్కకు నిరాశ ఎదురవుతుంది. అక్క పిల్లలు కూడా కెనడా మామయ్య వస్తాడని ఎదురుచూసి అంతులేని నిరాశకు గురికాబడతారు. కథాంతంలో నందుపాత్ర ద్వారా చక్కటి సందేశాన్నిచ్చారు రచయిత్రి.

"కొందరు తమ ప్రవర్తన ద్వారా ఎలా నడుచుకోవాలో తెలియజేస్తారు, మరికొందరు ఎలా ప్రవర్తించకూడదో తెలియజేస్తారు. మానవ జీవితాన్ని మధురతరం, ఐశ్వర్యవంతము చేయగలిగేవి మమకారం, ప్రేమానురాగాలే."[34]

ఆత్మీయులు ఉండటమే నిజమైన ఐశ్వర్యం, మనుషుల మధ్య అంతస్థుల తేడాలున్నా రక్త సంబంధాలు విడిచిపెట్టేటంత దూరం కాకూడదని ఈ కథలో తెలియజేసారు రచయిత్రి. గొప్పవాడవ్వటమే తన రక్త సంబంధీకులను మరిచిపోయేంత ధనం సంపాదించడం కాదని, అంతకంటే గొప్పగా ఆలోచించగలగడమేనని తెలియజేస్తారు. సొంత అక్కని మరిచిపోయిన కెనడా మామయ్యను ఆదర్శంగా తీసుకోకూడదని కథలో నందూ పాత్ర ద్వారా తెలియజేస్తారు రచయిత్రి.

---

**33. మనసునమల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 25**

**34. మనసునమల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 32**

"నువ్వు ఎప్పుడూ ఆ మామయ్య గారిలా గొప్పవాడివి కావాలని చెబుతుంటావుగా ఆ మామయ్యలా గొప్పవాడిని కావాలని ఎప్పుడూ... ఇంకెప్పుడూ నాతో చెప్పకు!"[35] చక్కటి కథాకథనంతో, పాఠకుడు కలకాలం తన హృదయంలో పదిలపరచుకునే విధంగా కథను మలిచారు రచయిత్రి గోగినేనిమణి. తనదైన శైలిలో కథను నడిపిస్తూ నానాటికి దిగజారిపోతున్న మానవీయ విలువలను తట్టి లేపారు.

## 2.3.2 అందం :

కథలో ప్రధానపాత్ర సుందరి. సుందరి పేరుకుతగ్గ రూపంలేకుండా అంద విహీనంగా ఉంటుంది. కానీ తన స్వభావం, వ్యక్తిత్వం చాలా గొప్పవి. ఒక రోజు కళాశాలలో లెక్చరర్ రవీంద్ర కొత్తగా వచ్చినందున తన పేరు ఏంటని అడుగుతాడు. ఆమె సుందరి అని సమాధానమిస్తుంది. ఆ సమాధానం వినగానే తరగతిలో ఉండే అబ్బాయిలందరు పేరుకు తగ్గ రూపంలేదని హేళన చేస్తారు. రవీంద్ర వారించేలోపు ఆ అమ్మాయి అబ్బాయిల వైపు చూస్తూ నిర్భయంగా ఇలా అంటుంది.

"చూడండి, మీలో ఎంతమంది సార్థకనామధేయాలున్నారో గానీ నాకు తెలియదు. పుట్టినప్పుడు అందంగా కనిపించానో లేక పెద్దవాళ్ళ పేరనో ఏదో కారణంతో తల్లిదండ్రులు నాకీపేరు పెట్టి ఉండొచ్చు. ఎవరి రూపురేఖలకైనా వాళ్ళ బాధ్యతేమీ ఉండదని మీ అందరికి తెలుసు. కానీ, మన స్వభావానికి, గుణగణాలకీ మనదే బాధ్యత. దానిని బట్టే ఎవరినైనా ప్రశంసించినా, పరిహసించినా సమంజసంగా ఉంటుందని నా అభిప్రాయం."[36]

తరగతి విడిచి పెట్టిన తర్వాత రవీంద్ర ఆ అమ్మాయి దగ్గరికి వెళతాడు. తోటి విద్యార్థులు కుర్రతనం కొద్ది ఏదో అంటారు. అంతమాత్రాన బాధపడకూడదని సుందరితో అంటాడు. తాను బాధపడింది వారన్నదానికి కాదని, వారితో పాటు లెక్చరర్ స్థానంలో ఉన్న మీరు కూడా నవ్వడం బాధ కలిగించిందని అంటుంది.

"ఉపాధ్యాయుడు విద్యార్థుల ప్రతిభకే గానీ రూపురేఖలకి ప్రాముఖ్యత ఇవ్వకూడదు. కానీ స్టూడెంట్సుతో పాటూ మీ పెదవులపై విరిసిన చిరునవ్వే నన్ను బాధపెట్టింది. మీకు చెప్పాల్సిన మాటలను మీతో చెప్పలేక వాళ్ళతో చెప్పాను."[37]

35. మనసునమల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 32

36. మనసునమల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 76,77

37. మనసునమల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 77

ఆ మాటలు విన్న రవీంద్ర పశ్చాత్తాపపడతాడు. కావాలని చేయకపోయినా అప్రయత్నంగా జరిగిన పొరపాటుకు రవీంద్ర బాధపడతాడు. ఆ అమ్మాయి సాహసం, నిర్భయత్వం, ముక్కుసూటితనం రవీంద్రకు నచ్చుతుంది. తనకో పెన్నును బహుమతిగా ఇస్తాడు. ఆమె ఎందుకని, ఆశ్చర్యంగా అడుగుతుంది. రవీంద్ర సమాధానం చెబుతూ నిజానికి నువ్వు విద్యార్థివే అయినా ఆ రోజు నాకొక పాఠం నేర్పించి గురువుగా మారావు. నా గురుదక్షిణగా నీదగ్గరే ఉంచు అని అంటాడు. ఆమె క్షమించమని అడుగుతుంది. ఆ రోజు ఆవేశంలో అనేసాను అంటుంది. నా పొరపాటును గుర్తించేటట్లు చేసిన నీ సాహసానికి నేనెంతో ముగ్ధుణ్ణయ్యాను అంటాడు రవీంద్ర. రవీంద్ర బదిలీ అయ్యి వెళ్ళేటప్పుడు సుందరి అతనికో పుస్తకాన్ని బహుమతిగా ఇస్తుంది. అప్పుడు రవీంద్రకు ఆమె అందాల శిష్యురాలిలా కన్పిస్తుంది.

"అందం స్వభావ లోపాన్ని పూరించలేదు కానీ, మంచి స్వభావం అందంలేని లోపాన్ని పూరిస్తుంది"[38] అన్న వాక్యంతో కథ ముగుస్తుంది.

**సమీక్ష :**

శారీరక సౌందర్యం కంటే మానసిక సౌందర్యమే గొప్పదని చాటి చెప్పే అద్భుత కథ అందం. కథలో సుందరి పాత్రను ఎంతో హుందాగా తీర్చిదిద్దారు రచయిత్రి. కళాశాలలో రవీంద్ర అనే లెక్చరర్ అడిగిన ప్రశ్నకు ఒక అమ్మాయి సమాధానమిస్తుంది. కళాశాల ప్రారంభమై పదిహేను రోజులైనా అంతవరకు ఆ అమ్మాయిని ఎప్పుడు చూడని కారణంచేత ఆ అమ్మాయి పేరేంటని రవీంద్ర అడుగుతాడు. ఆమె సమాదానంగా సుందరి అని చెబుతుంది. పేరు వినగానే తోటి విద్యార్థులు హేళన చేస్తారు. అందుకు కారణం ఆమె పేరుకు తగ్గ రూపం కాదు. రూపురేఖలను బట్టి గౌరవించే సమాజానికి గొడ్డలి పెట్టులాంటి సమాధానమిస్తారు ఈ పాత్ర ద్వారా రచయిత్రి. రూపురేఖలనేవి వంశపారంపర్యంగా వస్తాయని, కానీ వ్యక్తుల స్వభావం, గుణగణాలు అలవర్చుకుంటే వచ్చేవని తెలియజేస్తారు. వాటిని ఆధారంగా చేసుకునే వ్యక్తుల గౌరవ మర్యాదలు ఉండాలని రచయిత్రి అభిప్రాయపడతారు.

---

38. మనసునమల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 78

మానవీయ విలువలు సమాజంలో నానాటికి అంతరించిపోతున్నాయి. అటువంటి విలువలను ఈ కథ ద్వారా తట్టి లేపే ప్రయత్నం చేసారు రచయిత్రి. విద్యార్థులతో పాటే, లెక్చరర్ కూడా ఆమె పేరు విని నవ్వడం సుందరికి బాధ కలిగిస్తుంది. ఉన్నతమైన అధ్యాపక వృత్తిలో ఉంటూ కూడా పరిణతి లేని వ్యక్తిత్వంను కనబరిచిన రవీంద్రను చూసే తాను ఎక్కువగా బాధపడ్డానని తెలియజేస్తుంది సుందరి. ఆ మాటలతో రవీంద్రలో మార్పు వస్తుంది. తన తప్పు తాను తెలుసుకుంటాడు. రవీంద్ర కావాలని చేయకపోయినా అప్రయత్నంగా దొర్లిన తప్పును సరిదిద్దుకోవాలని ఆమెకు ఒక పెన్ను బహుకరిస్తాడు. ఆమె ఎందుకని అడుగుతుంది. అందుకు సమాధానంగా రవీంద్ర ఇలా అంటాడు.

"అది నా గురుదక్షిణగా నీదగ్గరే ఉండనివ్వు! నిజానికి నా విద్యార్థులే అయినా ఆ రోజు నాకొక పాఠం నేర్పించి గురువువు కూడా అయ్యావు"[39] అంటాడు. సుందరి మనసులోని మాటను నిర్భయంగా చెప్పగలిగిన సాహసం రవీంద్రను ముగ్ధుడిని చేస్తుంది. ఈ సన్నివేశం రవీంద్రకే కాదు సహృదయ పాఠకుడికి కూడా మంత్రముగ్ధున్ని చేసేవిధంగా సన్నివేశ కల్పన చేసారు రచయిత్రి. తను అందవిహీనంగా ఉందని అందరూ నవ్వితే బాధపడి ముడుచుకుపోకుండా ధైర్యంగా సమాధానం చెప్పిన తీరు నేటికాలపు స్త్రీలకు ఒక మేలుకొలుపుగా రచయిత్రి ఈ పాత్రను తీర్చిదిద్దినట్లు అనిపిస్తుంది. రవీంద్ర మాటలు విన్న సుందరి ఎంతగానో సంతోషిస్తుంది. అప్పటి నుండి రవీంద్రకు ఆమె ఒక అభిమాన శిష్యురాలుగా మారిపోతుంది. సాహసం, చురుకు, తెలివితేటలు కలిగిన అమ్మాయిలు తమ విశిష్ట వ్యక్తిత్వం వలన బాహ్యరూపం ఎలా ఉన్నా అందంగానే కన్పిస్తారు అని ఈ కథలో ఒకానొక సందర్భంలో తెలియజేసారు రచయిత్రి. అందం కంటే మంచి స్వభావమే వ్యక్తికి పరిపూర్ణత్వాన్నిస్తుందని ఈ కథ ద్వారా రచయిత్రి సమాజానికి తెలియజేసారు.

## 2.3.3 కలిసిన హృదయాలలోన...:

ఈ కథ ఒక కొత్త పంథాలో సాగింది. సమాజానికి ఒక కొత్త దారి చూపించింది. కథలోని ప్రధాన పాత్ర మనస్విని. మనస్విని, రాజేష్ అనే అబ్బాయిని ప్రేమిస్తుంది. పెద్దలను సంప్రదించి పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకుంటారు. రాజేష్ తల్లిదండ్రులు మనస్విని ఇంటికివెళ్ళి విషయంచెప్పి కట్నకానుకల ప్రస్తావన తెస్తారు. రాజేష్ తల్లిదండ్రులు, మనస్విని తల్లిదండ్రులతో కట్నకానుకల కోసం జరిపిన బేరసారాలును వినీ మనస్విని పెళ్ళి రద్దు

39. మనసునమల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 77

చేయమంటుంది. ఇష్టపడి ప్రేమించిన అబ్బాయితో పెళ్ళిని ఎందుకు రద్దు చేయాల్సి వచ్చిందో అక్క సునంద వచ్చి అడిగితే చెబుతుంది.

మీ సంబంధం కావాలని వచ్చిన వాళ్ళను ఇంత కట్నం కావాలని అడగడం కొంత సమంజసంగా ఉంటుందేమో కానీ మా అబ్బాయి మీ అమ్మాయిని ప్రేమించాడని ఇంత కట్నం ఇవ్వండి అని అడగడం ఎంత అసహ్యంగా ఉంటుందో మీ ఆలోచనలకి అందలేదా? అని అడుగుతుంది.

మనస్విని పెళ్ళి ఖర్చుల కోసం ఆమె తండ్రి ఇష్టపడి కొనుక్కున్న ఫ్లాట్‌ను అమ్మకం పెట్టాలనుకుంటాడు. అది ఆమెకు నచ్చదు. అదే విషయం సునందతో చెబుతుంది. సునంద చెల్లెలును అనునయిస్తూ అప్పుచేసి పెళ్ళిచేస్తే ఇబ్బందవుతుందని అమ్మేస్తానన్నారు. తర్వాత తమ్ముడు హరికి ఉద్యోగం వస్తే కొనుక్కుంటారు అనగానే మనస్వినికి మరింత కోపం కలుగుతుంది. కొడుకు ఆసరా... కూతురు భారమా? అని అడుగుతుంది. మగాళ్ళతో సమానంగా చదివి ఉద్యోగాలు చేస్తున్న ఈ పరిస్థితులు ఉండాల్సిందేనా అని అంటుంది.

ఎవ్వరికైనా కట్నం ఇవ్వక తప్పదన్నప్పుడు నచ్చిన వాడికి ఇచ్చి చేస్తే ఏం? అది తల్లిదండ్రుల బాధ్యత అంటుంది సునంద. సునంద మాటలకు ససేమిరా అంగీకరించదు మనస్విని. పెళ్ళి కాకపోయినా ఫర్వాలేదు కానీ అలాంటి పెళ్ళి మాత్రం చేసుకోనని అంటుంది. పెళ్ళి ఒక్కటే జీవిత పరమార్థం కాదని అంటుంది.

మనస్విని స్నేహితురాలు సరిత వస్తుంది. ఆమె తన ఇంటి సమస్యలు వివరిస్తుంది. పెట్టిపోతలు వలన ఏ విధంగా అప్పులలో కూరుకుపోతున్నారో వివరిస్తుంది. బారసాల కోసం, గృహ ప్రవేశం కోసం, శ్రావణమాసం నోము పేరుతో కన్నవారింటిని ఏవిధంగా ఇబ్బందులపాలు చేస్తున్నారో తెలియజేస్తుంది. సరిత మనస్విని పెళ్ళి ప్రస్తావన తెస్తుంది. కట్నం అడిగారనీ పెళ్ళి వద్దన్నానీ తెలియజేస్తుంది మనస్విని. సరిత ఆశ్చర్యంగా చూస్తుంది. సరిత వెళ్ళిన తర్వాత రాజేష్ తల్లి రుక్మిణి వస్తుంది. మనస్వినితో మనసు విప్పి మాట్లాడుతుంది. కట్నము సమస్య అయితే వద్దని అంటుంది. మనస్విని చేతిని ఆమె చేతిలోకి తీసుకుని మీ ఇద్దరికి పిల్ల నచ్చితే అలా చేద్దాం అంటుంది. మావాడు అందమైన అమ్మాయినే కాదు, వ్యక్తిత్వం, ఆత్మగౌరవం ఉన్న అమ్మాయిని ప్రేమించినందుకు గర్వంగా ఉందని అంటుంది. ఏ ఆడంబరాలు లేకుండా పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకుంటారు. పెళ్ళి పేరుతో అనవసర ఖర్చులకు పోకుండా తక్కువ మొత్తంలోనే పెళ్ళితంతు జరిగేలా నిర్ణయిస్తారు.

పెళ్ళి ఆడంబరంగా జరగడం కంటే, ఆనందంగా జరగటమే మధ్యతరగతి కుటుంబాలకు కావాల్సింది అనీ మనస్విని భావిస్తుంది. కూతురు మాటలు విన్న రఘుపతి వాత్సల్యంతో దగ్గరకు తీసుకుంటాడు. ఒక కొత్త సంప్రదాయానికి తెరతీస్తున్న మనస్వినిని మనస్ఫూర్తిగా అభినందిస్తాడు. తనకున్న ఆస్తిలో కొడుకుతో పాటు, కూతురికి, కూడా సమాన వాటా ఇస్తాననీ అంటాడు. తండ్రి మాటలు విన్న మనస్విని ఆస్తితో పాటు బాధ్యతను కూడా పంచమని అంటుంది. కోడలు బాధ్యతగా చేయాల్సి వస్తే, కూతురు అభిమానంతో చేస్తుందని అంటుంది. మనస్విని ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని గమనిస్తున్న తల్లి మౌనంగా ఉంటుంది. మనస్విని ఆత్మవిశ్వాసం, ధైర్యం చూసి తల్లిగా గర్వపడుతుంది.

**సమీక్ష :**

ఆడపిల్లను కన్న సగటు మధ్యతరగతి కుటుంబాలు పడే ఇబ్బందులను ఈ కథ ద్వారా కళ్ళకుకట్టినట్లు చూపారు రచయిత్రి. కథలో ప్రధానపాత్ర మనస్విని. ఈమెలో స్త్రీవాద భావజాలం కన్పిస్తుంది. అన్నింటిలోనూ స్త్రీ, పురుషులు సమానమేనన్న సమాజంలో అక్కడక్కడా స్త్రీలకు వివక్ష తప్పడంలేదనీ అంటుంది. అందుకు ఉదాహరణగా అందరూ అబ్బాయిలను ప్లస్సులనీ, అమ్మాయిలను మైనస్‌లనీ అవమానకరంగా మాట్లాడటం తనకు నచ్చదనీ అంటుంది.

పత్రికలలో పొదుపు గురించి వచ్చే ప్రకటనల్లో అమ్మాయి పెళ్ళికి, అబ్బాయి చదువుకి డబ్బును పొదుపు చేసుకోండని అంటారనీ ఈ పరిస్థితి ఇంకెన్నాళ్ళని మనస్విని పాత్ర ద్వారా సమాజానికి ప్రశ్నిస్తారు రచయిత్రి. వరకట్న సమస్య వల్ల ఎన్నో జీవితాలు నాశనమవుతున్నాయి. అప్పులతో కొన్ని కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అటువంటి వాటిని దగ్గరగా గమనించిన రచయిత్రి. సమాజంలో మార్పు కోసం ఈ ఇతివృత్తాన్ని తీసుకున్నట్లు తెలుస్తుంది.

మనస్విని స్నేహితురాలు సరిత పాత్ర ద్వారా ఆడపిల్లలను కన్న మధ్యతరగతి కుటుంబాలు ఏ విధంగా ఇబ్బందులు పడుతున్నరో తెలియజేసారు రచయిత్రి. నాలుగు నెలల క్రితం పెద్దక్క మావగారు చనిపోయారు. అమ్మవాళ్ళు అక్కాబావలకి బట్టలు పంపించారు. అక్కావాళ్ళు బిజినెస్‌లో బాగా సంపాదించినవాళ్ళు, ఖరీదైన బట్టలు పంపించమని చెప్పింది. చిన్నక్క గృహప్రవేశం చేస్తుంది. కనుక ఆమెకు కావల్సిన సామగ్రిని కొని పంపించమని ఆమె చెప్పింది. శ్రావణమాసంనోమనీ మాఅత్తగారు పిలిస్తే మాకు

బట్టలు పెట్టాల్సి వచ్చిందనీ అందుకోసం తమ తల్లిదండ్రులు అప్పు చేయాల్సి వచ్చిందని ఎప్పుడో ఎవరో నిర్ణయించిన ఆచారాలను, మారిన రోజులను బట్టి మార్చుకోకుండా ఆ ఆచారాలను పట్టుకొని మధ్యతరగతి ప్రజలు మరింత అప్పుల పాలవుతున్నారని ఈ పాత్ర ద్వారా రచయిత్రి తెలియజేసారు.

కట్నాల ప్రసక్తి వలన పెళ్ళి వద్దన్నాని సరితతో మనస్విని అంటే ఆమె ఆశ్చర్యంగా చూస్తుంది. మనస్విని ప్రేమించిన రాజేష్ పాత్రను కూడా ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దారు. కట్నం అడగటం వల్ల పెళ్ళి రద్దు చేసుకున్నట్లు తెలుసుకున్న రాజేష్ తన తల్లితో ఇలా అంటాడు.

"నువ్వు నిర్ణయించిన నారేటు ఆ అమ్మాయికి నచ్చలేదు, నాకు చెప్పకుండా ఇలా చేస్తావనుకోలేదు."[40]

ఆ మాటలు విన్న రాజేష్‌తల్లి రుక్మిణి తనతప్పుతెలుసుకుని మనస్వినితో మాట్లాడటానికి వస్తుంది. మధ్యతరగతి కుటుంబాలలో పెళ్ళిళ్ళు జరిగే ముందు ఆర్భాటాలకు అప్పు చేయక తప్పదనీ అందుకే కట్నంఅడగక తప్పలేదని వివరిస్తుంది. కట్నమే సమస్య అయితే వద్దని అంటుంది. అప్పుజోలికి వెళ్ళకుండా ఏ హంగులు, ఆర్భాటాలు లేకుండా పెళ్ళి చేసుకోవడానికి నిశ్చయించుకుంటారు మనస్విని, రాజేష్. అందుకు వారి పెద్దలు కూడా అంగీకరిస్తారు. ఒక నూతన సంప్రదయానికి తెర తీస్తున్నందుకు వారిని అభినందిస్తారు.

ఈ కథ ద్వారా రచయిత్రి సమాజానికి చక్కటి సందేశాన్నిచ్చారు. మధ్యతరగతి కుటుంబాలు పెళ్ళిళ్ళ కోసం, ఇతరత్రా కార్యక్రమాల కోసం అనవసరఖర్చులు చేసి అప్పులపాలవుతున్నారు. మన అంతస్థుకు తగినట్లు విధివిదానాలు రూపొందించుకుంటూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటాయి. ఆడపిల్లలను కన్న తల్లిదండ్రుల, వారి అత్తారింటిలో జరిగే ప్రతి కార్యక్రమంకి తమవంతు భాగంగా ఏవో పెట్టుపోతలు పెట్టడం వంటి ఆచారాలను సడలించిననాడు ఆర్థిక సమస్యలు నుండి మధ్యతరగతి కుటుంబాలు గట్టెక్కుతాయి అనీ చక్కటి పరిష్కారమార్గాన్ని ఈ కథ ద్వారా చూపారు రచయిత్రి. తల్లిదండ్రులకు కొడుకు, కూతురు ఇద్దరూ సమానమేనని తల్లిదండ్రుల ఆస్తులలోనే కాదు బాధ్యతలలో కూడా పాలు పంచుకోవాలని అంటారు రచయిత్రి.

---

**40. మనసునమల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 105**

## 2.3.4 ఎదురు చూపు :

ఒక స్త్రీమూర్తి అదుపుతప్పిన తనమనవళ్ళ గురించి కొడుక్కిరాసిన లేఖలా సాగింది ఈకథ. అంతరించిపోతున్న మానవీయ విలువలకు అద్దం పట్టిన కథ. నేటితరం దుష్టభావాజాలాన్ని ఖండించిన గొప్పకథ ఎదురుచూపు. పట్నవాసంలో ధనమదంతో దారి తప్పుతున్న యువకులను ఉద్దేశిస్తూ తనదైన శైలిలో కథను నడిపించారు రచయిత్రి. ఇందులో తల్లిపాత్రలో రచయిత్రి లీనమయ్యారు.

ఆస్తిపాస్తులు లేకపోవటం వలన ఇష్టపడ్డ అమ్మాయిని వివాహం చేసుకోలేక వేరొక వివాహం చేసుకోవాల్సివచ్చిన వ్యక్తి తనపంతం, పట్టుదలతో వ్యాపారాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి కోటీశ్వరుడౌతాడు. వ్యాపార విషయాలలో పడి పిల్లల్నిగమనించే తీరుబడి లేక విచ్చలవిడిగా వదిలేస్తాడు. పల్లెటూరిలో ఉన్నతల్లి తనబిడ్డ ఎదుగుదలను చూడటానికి వస్తుంది. అతని స్థితిగతులకు అద్దం పడుతున్న ఇంటిని చూడగానే ఆనందంతో నోట మాటరాదు. అలాంటి అధునాతనమైన, అందమైనఇంటిని తానెప్పుడూ చూడలేదు. తన కొడుకు అన్ని సౌకర్యాలతో ఒక గదిని తనకోసం కేటాయిస్తాడు. కొడుకు ఎదుగదలను చూసినతల్లి సంబరపడుతుంది. కానీ ఆ ఆనందం ఎన్నాళ్ళో నిలవదు. ఆమెలో ఆనందం క్రమక్రమంగా కరిగిపోతూ వస్తుంది. నగరనాగరికత... మారిపోతున్న పరిస్థితుల ప్రభావం వలన ఇలాగే ఉంటుందని తన మనసుకు తానే సర్ధిచెప్పుకుంటుంది.

ఒక రోజు.... టీవి చూస్తూ కూర్చున్న తనకు తన మనవళ్ళ మాటలు వినిపిస్తాయి. మనవడు దివాకర్, మనవరాలు దీప్తి తమ స్నేహితులతో కలిసి ఏవో మంతనాలు చేయడం గమనిస్తుంది. మొదట ఏమీ అర్థం కాకపోయినా విషయం తెలుసుకుని నిర్విణ్ణురాలవుతుంది.

మనవడు దివాకర్ కాలేజీలోని ఎవరో అమ్మాయిని ప్రేమిస్తాడు. ఆ అమ్మాయి వీడి ప్రేమను అంగీకరించదు. ఆమె హేళనచేయడంతో ఆమెమీద కక్ష పెంచుకుంటాడు. నాకు దక్కని అందం ఇంకెవ్వరికీ దక్కకూడదని యాసిడ్ దాడి చేయడానికి పథకం చేస్తాడు. మనవరాలు దీప్తి కూడా సోదరుడికి వత్తాసు పలుకుతుంది. అది విన్న ఆమె మందలిస్తుంది. వాళ్ళ మాటలు, అలవాట్లు తెలిసేసరికి ఆమెకు మతిపోతుంది. ఆ రాత్రంతా భయంతో, ఆందోళనలో ఆమెకు నిద్రపట్టదు. అదుపులేకుండా వాళ్ళ చేతికందుతున్న ధనప్రభావం వలన వీళ్ళు చెడుదారి పట్టారనీ భావిస్తుంది. దివాకర్ ప్రేమించిన అమ్మాయి ఫోను నంబరు కనుక్కొని దాడి విషయం ఆమెతోచెప్పి హెచ్చరిస్తుంది. తల్లిదండ్రుల మాట వినే దశ

దాటిపోయారని తెలుసుకుని కొడుకు, కోడలితో చెప్పకుండా పట్నం నుండి తిరిగి పల్లెకు చేరుకుని కొడుక్కి సవివరంగా ఉత్తరం రాస్తుంది.

**సమీక్ష :**

ఆమెకు ఆ భవంతి ఒక ఇల్లులాగా అనిపించదు. అందరిని కలిపి ఉంచే పూలదండలో దారమేదో తెగిపోయినట్లు, అందరూ విడివిడిగాఉంటారు. నలుగురు కలిసి కూర్చుని సరదాగా కబుర్లుచెప్పుకునే సమయం ఉండదు. అందరూకలిసి ఒకపూటైనా భోజనం చేయరు. ఒకరిసంగతులు ఇంకొకరికి పట్టనట్లు ఉంటారు. దానికే వ్యక్తిగతస్వేచ్ఛ అని కొత్త నిర్వచనం ఇస్తుంటారు. "కుటుంబసభ్యుల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణం, ఆప్యాయతల పరిమళం లేకపోతే అది ఇల్లు కాదు... నిర్జీవమైన ఇటుకల భవంతి మాత్రమే"[41] అని అంటారు రచయిత్రి.

పేదవాడని అవమానించిన వాళ్ళకు... సంపాదించి చూపించటమే ప్రతీకారం తీర్చుకోవటం అని భావించిన వ్యక్తి ధనం సంపాదించాలనే ధ్యాసలో పిల్లలు పెడదారి పట్టినా తెలుసుకోలేడు. తమ ప్రేమను కాదన్న వాళ్ళ అంతు చూడాలని విర్రవీగుతుంటారు. ఏ తప్పుచేసినా తప్పించుకు తిరగగలము అన్న అహంకారం కలిగి ఉంటారు. సంపాదన వ్యామోహంలోపడి కుటుంబాన్ని, పిల్లలను నిర్లక్ష్యంచేస్తే దాని పర్యవసానం ఎలా ఉంటుందో ఈ కథ ద్వారా సమాజానికి తెలియపరిచారు రచయిత్రి.

పిల్లల మనసులలో సమాజానికి హానికలిగించే ఆలోచనలను తల్లిదండ్రులు తెలుసుకోలేకపోవటం ఒక లోపమే. ఆ తప్పుని తెలుసుకుని మందలించకపోవటం తప్పే అవుతుంది. పిల్లల పట్ల బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించే తల్లిదండ్రులకు ఒక మేలుకొలుపుగా ఉంది ఈ కథ. సంపాదన కంటే కుటుంబబాధ్యతలే ముఖ్యమని తల్లిపాత్ర ద్వారా తెలియజేసారు రచయిత్రి. ఇక్కడ ఒక చక్కటి ఉదాహరణ తెలియజేసారు రచయిత్రి.

"ఏ గిన్నెలో వుంటేనేమి గానీ, రుచికరమైన పాయసమే ముఖ్యమని నేననుకుంటాను. మీకు మాత్రం అది అందమైన, ధగధగలాడే వెండిగిన్నెలో ఉండాలి. రుచితో పట్టింపులేదు. నేనలా రాజీ పడలేక అక్కడ ఉండలేక ఇక్కడకు వచ్చేసాను"[42] అంటుంది. కొడుకును హెచ్చరిస్తుంది నువ్వు సంపాదించిన దానికంటే కోల్పోయిందే ఎక్కువని, అదిఎంతో

**41. మొగలిపువ్వు కథాసంపుటి – గోగినేని మణి – పుట 32**

**42. మొగలిపువ్వు కథాసంపుటి – గోగినేని మణి – పుట 32**

అమూల్యమైందో ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే నీకర్థమవుతుందని అంటుంది. తిరిగి నీ ఇంటిని అందమైన పూలతోటలా తీర్చిదిద్దే ప్రయత్నం మొదలుపెట్టాలనుకుంటే తప్పకుండా సాధించగలుగుతావు అంటుంది. అటువంటి పూలతోటలాంటి ఇంటికి రమ్మనేపిలుపు కోసం తాను ఎదురు చూస్తూ ఉంటాను అని అంటుంది.

ధనవ్యామోహంలో పడి మానవీయ విలువలు మరిచిపోతున్న సమాజానికి ఈ కథ ద్వారా మేలుకొలుపు పలికారు రచయిత్రి గోగినేనిమణి.

## 2.3.5 షాక్ ట్రీట్‌మెంట్ :

మానవీయవిలువలు మరిచి ప్రైవేటుహాస్పటల్‌లో చేసే దోపిడిని ఈ కథ ద్వారా సమాజానికి తెలియజేసే ప్రయత్నం చేసారు రచయిత్రి. కథలో ప్రధాన పాత్ర శశికాంత్. శశికాంత్ వృత్తిరీత్యా వైద్యుడు. వైద్యశాస్త్రంలో పట్టా పుచ్చుకున్న తర్వాత ఒక ప్రైవేటు హాస్పటల్‌లో డాక్టరుగా జాయిన్ అవుతాడు. ఆ క్షణం కించిత్ గర్వంతో కూడిన ఆనందం అతని మనసులో కెరటంలా ఎగసిపడుతుంది. వృత్తిని అమితంగా అభిమానించే ఎవరికైనా ఆ భావన సహజమే. తను చిన్నప్పుడు చూసిన ఒక సంఘటన అతడిని డాక్టరు కావాలనే నిర్ణయం తీసుకునేటట్లు చేస్తుంది. తెల్లని దుస్తుల్లో ఉండి వైద్యవృత్తిని చేస్తున్న వాళ్ళను చూస్తుంటే అతనికి దేవదూతల్లా కనిపించేవారు. ఎందుకంటే డాక్టర్లు ప్రాణాపాయంలో ఉన్నవారికి ప్రాణం పోసేవాళ్ళు కావున వాళ్ళంటే అతనికి గౌరవ భావన. వాళ్లని చూసి అదృష్టవంతులుగా భావించేవాడు. ఎలాగైతేనేం పెద్దయ్యాక తానూ ఆ జాబితాలో చేరతాడు. కాకపోతే తన చదువు పూర్తవ్వడానికి అప్పు చేయాల్సి వస్తుంది. ఆ అప్పుని తీర్చేయగలడన్న ధీమా అతనికి ఉంది. కారణం నగరంలోనే ఆధునిక వైద్య సదుపాయాలున్న పరమేశ్వరం హాస్పటల్‌లో వైద్యుడిగా అవకాశం లభిస్తుంది.

ఒకనాడు హాస్పటల్ కారిడార్‌లో ఒక మూలన ఉన్న గుంపు దగ్గరినుండి వస్తున్న డాక్టర్ రమణని చూసి సంగేతేంటి అని అడుగుతాడు. పాపం ఎవరో కుర్రాడు, రోడ్డు దాటుతుండగా ఆటో గుద్దేసింది. తలకు బాగా దెబ్బ తగిలింది. ఆలస్యం కాకుండా వెంటనే ఆపరేషను జరిగితే బ్రతికే అవకాశం ఉందని అంటాడు రమణ. మరి ఆలస్యం ఎందుకని ప్రశ్నిస్తాడు శశికాంత్. ఆపరేషన్‌కు కావాల్సిన డబ్బులు ఇవ్వడానికి వివరాలు చెప్పడానికి అతను స్పృహలో లేడు. అతడిని తీసుకువచ్చిన వారిదగ్గర అంత డబ్బు లేదు. అందుకే ఎమ్.డి. గారు ఆపరేషన్‌కు ఒప్పుకోవటం లేదని అంటాడు.

శశికాంత్ నిర్ఘాంతపోతాడు. ఎమ్.డి. పరమేశ్వరం గదికి పరిగెత్తుకుంటూ వెళతాడు. ఆ యాక్సిడెంట్ కేసు సంగతి చెబుతాడు. రమణతో చెప్పిన విషయమే శశికాంత్‌తో కూడా చెబుతాడు. చేసేదేమీ లేక నిస్సహాయంగా బయటకు వస్తాడు. యాక్సిడెంట్ అయిన కుర్రాడికి కొంచెం స్పృహ వచ్చి అతని తల్లిదండ్రుల వివరాలు శశికాంత్‌కు చెబుతాడు. శశికాంత్ వెంటనే ఆపరేషన్‌కు సిద్ధం చేయిస్తాడు. పనులన్నీ ముగించి పరమేశ్వరం గదిలోకి వస్తాడు. శశికాంత్ మొహంలో చెమటలు చూసి ఉలిక్కి పడిన పరమేశ్వరం ఇలా అంటాడు.

నువ్వు చాలా సెంటిమెంటల్ అన్న మాట! కుర్రాడివి కదా... అలాగే ఉంటుంది! కొన్నాళ్ళు పోతే నువ్వే రాటుదేలతావు! ఈ మనుష్యుల్ని, పరిస్థితుల్ని చూసి నాలుగురాళ్ళు సంపాదించటమే ముఖ్యమనే విషయం నీకు అర్థమౌతుంది! ఏ మనిషైనా తన చదువుకు తగిన ఉద్యోగాన్ని వెదుక్కుని నాలుగు డబ్బులు సంపాదించుకోవాలని అనుకుంటాడు. డాక్టర్లయినా, వ్యాపారస్థుడైనా అంతే... తన పెట్టుబడికి తగ్గ లాభాలను కోరుకుంటాడు. అది మనకున్న హక్కే గానీ తప్పేమీ లేదు! ఈ విధంగా వైద్యాన్ని ఒక వ్యాపారంలా చూసే పరమేశ్వరం ఇంకా ఎన్నో విషయాలు చెబుతాడు. చదువుకోసం అయిన ఖర్చు లక్షల్లో ఉంటే, ఈ హాస్పిటల్ నిర్మాణానికి, ఎక్విప్‌మెంట్స్‌కి పెట్టుబడి కోట్లలో అయింది! ఇంత ఖర్చు పెట్టి, ధర్మాత్ముడనే పేరు కోసం పాకులాడి ఉచిత వైద్యం మొదలుపెడితే మనం పూర్తిగా మునిగిపోతాం అంటాడు.

శశికాంత్ పరమేశ్వరం మాటలకు అడ్డుపడి యాక్సిడెంట్ అయ్యింది తన కొడుక్కేనని చెబుతాడు. పరమేశ్వరం కాళ్ళ క్రింద బాంబు పేలినట్లు అనిపిస్తుంది. ఈ విషయం ఇంత నిదానంగా చెబుతున్నావా అని అరుస్తాడు. ఆపరేషన్‌కు అన్ని ఏర్పాట్లు చేసేసాను. మీ అనుమతి కోసం డాక్టర్లు ఎదురుచూస్తున్నారని అంటాడు శశికాంత్. పరమేశ్వరం కంట నీరు ధారాపాతంగా కారుతుంది. ఎంత ఖరీదు మందులైన ఇచ్చి బ్రతికించండని డాక్టర్లకు ఆదేశిస్తాడు.

పరమేశ్వరం ఆందోళనతో అటూ ఇటూ తిరుగుతుంటే అతణ్ణి పట్టుకుని మెల్లగా కూర్చీలో కూర్చోబెడతాడు. మరేం ఫర్వాలేదు నిశ్చింతగా ఉండండి అంటూ పరమేశ్వరంకు ధైర్యం చెబుతాడు శశికాంత్. నాకొడుకు... నా ప్రాణం చావుబతుకుల మధ్య కొట్టుకుంటుంటే నేను స్థిమితంగా ఎలా ఉండగలను అంటాడు.

పరమేశ్వరంతో శశికాంత్ తన ఆలోచనలు పంచుకుంటాడు. కొన్నాళ్ళుపోతే రాటుదేలి డబ్బు ప్రాముఖ్యతను తెలుసుకుంటానని అన్నారు కదా! చదువు పూర్తి చేయడానికి అవసరమైన డబ్బు కోసం నేను పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అలాంటిది డబ్బు విలువ నాకెందుకు తెలయదు సార్! బాగా సంపాదించాలనే కోరిక నాకు ఉంది. దానితో పాటు నిస్సహాయులైన రోగుల ప్రాణాలు కాపాడినప్పుడు పొందే ఆనందము ముఖ్యమే! సమాజం ఉపాధ్యాయుడికి, వైద్యుడికి పెద్దపీట వేసి కూర్చోబెట్టింది. వైద్యుడిని సాక్షాత్తు భగవంతుడి స్వరూపంగా భావిస్తారు. అంటే సమాజం పట్ల వైద్యుని బాధ్యత అందరికంటే కొంచెం ఎక్కువగా ఉండాలి. డబ్బు కంటే విలువైనది ప్రాణం. ప్రాణాలు పోయాక ఎంత డబ్బు కుమ్మరించినా తిరిగిరాదు అని అంటాడు. శశికాంత్ మాటలు విన్న పరమేశ్వరం చిరాకుపడతాడు. తనకి తెలిసిన విషయాలే చెప్పి విసిగించొద్దు అంటాడు.

మీకు తెలిసిన విషయాలే కానీ మీ అనుభవంలోకి రానివి అని అంటాడు శశికాంత్. తన బ్యాగు నుండి చెక్కుబుక్కు తీసి పదహారు వేలకి చెక్కు రాసి ఇస్తాడు. ఆ యాక్సిడెంట్ అయిన అబ్బాయి పరమేశ్వరం కొడుకు కాదని, తాను స్పృహలోకి వచ్చి చెప్పడానికి ప్రయత్నించినా చెప్పలేకపోయాడు. కావున అతని ప్రాణాలు కాపాడడానికి అబద్ధమాడాను అని అంటాడు. అందుకే రాజీనామా ఇస్తున్నాను అని అంటాడు.

కోటీశ్వరులకైనా, కార్మికులకైనా కన్నబిడ్డ మృత్యుముఖంలో ఉంటే కలిగే బాధ ఒక్కలాగే ఉంటుంది అంటూ గుమ్మం వైపు అడుగులు వేస్తూ యాక్సిడెంట్ అయిన కుర్రాడిని ఫీజు కారణంగా అడ్మిట్ చేసుకోకుండా పంపించినందుకు జరిమానా విధించిన వార్తను తెలియజేస్తారు. మీకలాంటి పరిస్థితి రాకుండా కాపాడాను అంటాడు. శశికాంత్ మాటలు విన్న పరమేశ్వరం ఒక్కసారిగా షాక్ ట్రీట్‌మెంట్‌కు గురైనట్లు అవుతాడు.

**సమీక్ష :**

ఆధునిక సమాజంలోని ప్రైవేటు ఆసుపత్రుల దోపిడిని ఈ కథ ద్వారా కళ్ళకు కట్టినట్లు చూపారు రచయిత్రి. కథలో పరమేశ్వరం పాత్ర దయలేని ప్రైవేట్ హాస్పటల్ అధినేత. మానవీయ విలువల కంటే డబ్బుకే అధిక ప్రాధన్యం ఇచ్చిన వ్యక్తిగా కన్పిస్తాడు. యాక్సిడెంట్ అయి స్పృహ లేని వ్యక్తిని అతని హాస్పటల్‌కు కొందరు తీసుకువస్తారు. వెంటనే చికిత్స చేయకపోతే ఆ వ్యక్తి చనిపోతాడు. కానీ పదహారు వేలు ఫీజు కడితేనే గానీ

ఆపరేషన్ చేయడానికి వీలు లేదంటాడు. కనీసం జాలి, కరుణ, దయ వంటివి లేకుండా నేటికాలం వైద్యులు అమాయక ప్రజలు నుండి డబ్బును గుంజే తీరును ఈ పాత్ర ద్వారా సమాజానికి పరిచయం చేసారు రచయిత్రి.

పరమేశ్వరం పాత్రలో డాక్టరు కంటే వ్యాపారస్థుడే కనబడుతాడు. ఒకానొక సందర్భంలో ఇలా అంటాడు. "ఏ మనిషైనా తన చదువుకు తగిన ఉద్యోగాన్ని వెతుక్కుని నాలుగు డబ్బులు సంపాదించుకోవాలనుకుంటాడు. డాక్టర్లయినా అంతే... వ్యాపారస్థుడైనా అంతే... తన పెట్టుబడికి తగిన లాభాలను కోరుకుంటాడు."[43]

పైవాక్యాలను బట్టి నేడు వైద్యవృత్తి ఏవిధంగా వ్యాపార ధోరణిలో సాగుతుందో పాఠకునికి అర్థమౌతుంది. ఇంకొక సందర్భంలో హాస్పటల్‌కు వచ్చే రోగులను ఎంతో చులకన చేసి మాట్లాడతాడు.

"ఇక్కడికి అందరూ రకరకాల రోగాలతో వచ్చేవాళ్ళే! వాళ్లందరి బాధలూ నువ్వు పట్టించుకుంటూ కూర్చుంటే ఇక నీకు స్థిమితం అనేదే ఉండదు. మన పని మనం చేసుకుంటూ తామరాకు మీద నీటి బొట్టులా ఉండాలి"[44] అని అంటాడు. పరమేశ్వరం పాత్రలో మార్పు తీసుకురావటం కోసం రచయిత్రి చక్కటి సన్నివేశం కల్పిస్తారు. యాక్సిడెంట్ అయిన వ్యక్తి తన కుమారుడేనని శశికాంత్ పాత్ర చేత అబద్ధమాడిస్తారు. ఒక్కసారిగా పరమేశ్వరంలో మార్పు వస్తుంది. తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపపడతాడు.

ఈ కథలో శశికాంత్ పాత్రను ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు రచయిత్రి. మానవీయ విలువలున్న మహోన్నతమూర్తిగా కన్పిస్తాడు శశికాంత్. యాక్సిడెంట్‌కు గురైన యువకుడిని కాపాడటానికి తను పనిచేసే ఆసుపత్రి ఎమ్.డి.తో అబద్దమాడతాడు. యాక్సిడెంట్ అయిన వ్యక్తి ఎమ్.డి. కొడుకని చెప్పి ఆపరేషన్ త్వరగా అయ్యేటట్లు చూస్తాడు. తర్వాత తన ఎమ్.డిలో మార్పురావటం కోసం ఒక చక్కటి కథను చెబుతాడు శశికాంత్.

"ఇద్దరు జాలరి దంపతులు సముద్రంలో కొటుకుపోయి ప్రాణాపాయంలో పడిన పిల్లాడిని తీసుకుని ఒక హాస్పటల్‌కి వస్తారు. అది సామాన్యులకి అందుబాటులో ఉండే హాస్పటల్ కాదు. పిల్లాడిని కాపాడమని ఎంత కాళ్ళవేళ్ళ పడినా ఎవరు పట్టించుకోరు. డాక్టరు ఏదో కాన్ఫరెన్స్‌కని హడావుడిగా వెళ్ళిపోతుంటే వాళ్ళు పిల్లాడిని చూడమని విలపిస్తూ

43. మొగలిపువ్వు కథాసంపుటి - గోగినేని మణి - పుట 42

44. మొగలిపువ్వు కథాసంపుటి - గోగినేని మణి - పుట 43

ప్రాధేయపడతారు. కానీ ఆయనవాళ్ళ గోడు వినిపించుకోకుండా వెళ్ళిపోతాడు. తిరిగి డాక్టరు వచ్చేటప్పటికి ఆ పిల్లాడు చనిపోతాడు. చనిపోయిన పిల్లాడిని పట్టుకుని రోదిస్తూ వాళ్ళింకా అక్కడే ఉంటారు. వాళ్ళు తీసుకొచ్చింది తన కొడుకునే అని తెలిసి డాక్టరు షాక్‌కి గురౌతాడు.

తన కొడుకు చనిపోయాడనే విషయానికే కాదు... ఎవరి కన్నబిడ్డనో కాపాడడానికి ఆ జాలరి దంపతులు పడిన తాపత్రయానికి, వాళ్ళలోని మానవత్వ వెలుగులకు అతనంత షాక్‌కి గురయ్యాడంటూ రచయిత్రి కథను ముగిస్తారు."[45]

చక్కటి ఉదాహరణ చెప్పి శశికాంత్, పరమేశ్వరం మనసును మార్చాలనుకుంటాడు. కథలో చక్కటి మలుపులుతిప్పి కథను సుఖాంతంగా ముగించటంలో రచయిత్రి గోగినేనిమణిది అందె వేసిన చేయి.

శశికాంత్ అబద్ధమాడి వైద్యం చేయించినందుకు తన స్వంతడబ్బు పదహారు వేలను చెక్కు రూపంలో పరమేశ్వరంకు అందిస్తాడు. డబ్బు వలన వచ్చిన ఆనందం కంటే నిస్సహాయులైన రోగుల ప్రాణాలను కాపాడగలిగినప్పుడు పొందే అపురూపమైన అనుభూతి చాలా సంతృప్తినిస్తుందనీ ఈ పాత్ర ద్వారా తెలియజేస్తారు రచయిత్రి.

వైద్యుని గొప్పతనాన్ని తెలియజేస్తూ సమాజంలో వైద్యుడిని దేవుడిలా భావిస్తారు. కనుక సమాజం పట్ల అతని నైతిక బాధ్యత అందరికంటే కొంచెం ఎక్కువని హెచ్చరిస్తారు రచయిత్రి. డబ్బు కంటే విలువైనది ప్రాణం అని, ప్రాణాలు పోయాక ఎంత డబ్బు కుమ్మరించినా తిరిగి రావని శశికాంత్ పాత్ర ద్వారా తెలియజేస్తారు.

మరుసటిరోజు హాస్పటల్ గదిలో కళకళలాడే మొహంతో తల్లిదండ్రులతో కబుర్లు చెప్పుకుంటున్న ఆ వ్యక్తిని చూస్తూ శశికాంత్ పొందిన అపురూపమైన ఆనందం ఎంత డబ్బు ఇచ్చినా కొనలేమని అంటారు రచయిత్రి. సమాజంలో అంతరించిపోతున్న మానవతా గుణాన్ని ఈ కథ ద్వారా జాగృతం చేసే ప్రయత్నం చేసారు రచయిత్రి. ఈ కథ ప్రతి వైద్యుడు తప్పక చదవాలి. చదివితే తప్పక వారి మనసులలో కాఠిన్యం పోయి మానవతా గుణం వికసిస్తుంది. డబ్బులేని పేదవాడు మానవీయ గుణంతో ఆలోచించగలిగినప్పుడు. డబ్బున్న ధనికునికి ఆ ఆలోచన రాకపోవడం రచయిత్రికి బాధకరమైన విషయంగా తోస్తుంది.

---

**45. మొగలిపువ్వు కథాసంపుటి – గోగినేని మణి – పుట 44**

## 2.3.6 బోధ వృక్షం నీడలో... :

ఈ కథ ద్వారా రాజకీయనాయకుల అంతరంగాన్ని ఆవిష్కరించారు రచయిత్రి. కథలో ప్రధానపాత్ర మాణిక్యాలరావు. ఈయన ప్రముఖ రాజకీయ నాయకుడు. ఎన్నికలలో పోటీ చేయడానికి పార్టీ టికెట్ ఖరారవుతుంది. అతని ప్రత్యర్థిగా ప్రజలలో మంచి పేరున్న భక్తవత్సలం పోటీ చేస్తున్నాడనీ తెలిసి బాగా కలవరపడతాడు. భక్తవత్సలం సేవాసదనం అనే అనాథాశ్రమం నడుపుతుంటాడు. భక్తవత్సలం పేరుప్రఖ్యాతలను గండి కొట్టాలని ప్రయత్నిస్తుంటాడు మాణిక్యాలరావు. ఏవిధంగానైనా అతని మీద చెడ్డ ఆరోపణలు చేయాలని తలచి, తన పి.ఎ. సంపత్‌ను ఆశ్రమానికి పంపిస్తాడు. ఆశ్రమంలో భక్తవత్సలానికి వ్యతిరేఖంగా ఎవరైనా చెబుతున్నారేమోనని కనుక్కొవడానికి ప్రయత్నిస్తాడు సంపత్. సేవాసదనంలో ఒక పెద్దావిడ చెప్పిన వివరాలు తమ ప్రచారానికి బాగా ఉపకరిస్తాయని భావించి ఆ విషయం మాణిక్యాలరావుతో చెబుతాడు. మాణిక్యాలరావు సమక్షంలో ఆ వివరాలన్ని చెబుతానందని తెలియచేసి మాణిక్యాలరావును సేవాసదనానికి తీసుకొని వెళతాడు.

భక్తవత్సలం ప్రఖ్యాతని దెబ్బకొట్టాలనే ప్రయత్నం సఫలమౌతుందన్న ఆశతో మాణిక్యాలరావు అతని పి.ఎ. సంపత్‌తో కలసి భక్తవత్సలం నడిపే ఆశ్రమానికి బయలుదేరతారు. పెద్దావిడ దగ్గరికి వెళ్ళి నిన్నచెప్పిన విషయాలు మళ్ళీచెప్పండి అని అంటాడు సంపత్. కళ్ళుసరిగా కనిపించని ఆ పెద్దావిడ చేతులతో తడుముతూ మాణిక్యాలరావేనని నిర్ధారించుకుని ఇలా అంటుంది. ఇక్కడ ఎక్కువ తక్కువలు లేవు. అందరిని సమానంగా చూసే మంచిమనిషి భక్తవత్సలంగారని అంటుంది. నలుగురి కోసం ఎవరోఒకరు పాటుపడుట యెందుకు, ఎవరిగొడవ వారు చూసుకుంటే ఏ ఇబ్బంది ఉండదు కదా! అని సంపత్ పెద్దావిడతో అంటాడు. అతని మాటను వ్యతిరేఖిస్తూ ఏ ఒక్కరు కూడా నలుగురి తోడ్పాటు లేకుండా బతకలేరు. నలుగురు లేకపోతే మనిషి మనుగడే లేదు. కుటుంబంలో ఒకరు సంపాదిస్తే ఒకరు తోడ్పడతారు. తిండికోసం, బట్టకోసం వేరొకరి మీద ఆధారపడక తప్పదు. కొందరు గొప్ప వాళ్ళే సమాజాన్ని తమ కుటుంబంగా భావించి నిర్భాగ్యులను ఆదరిస్తారు. ఒంటరిగా ధనరాశుల మధ్య బతకడంకంటే ఒకరినొకరుగా తోడు ఉండే జీవనం ఎక్కువ సంతృప్తినిస్తుంది అని అంటుంది.

పెద్దావిడ తన గురించి చెబుతూ ఆమె పేరు రాములమ్మ అని, ఆమె భర్త సీతయ్య. వారికి ఒక్కడే కొడుకు అని తెలియజేస్తుంది. ఆమె కొడుకు రాజకీయాలలో చేరి పెద్ద

నాయకుడయ్యాడని తెలియజేస్తుంది. డబ్బు వ్యామోహంలో పడి తల్లిదండ్రులను, పుట్టిన ఊరును మరిచిపోయాడని తెలియజేస్తుంది. అందుకే వారు సేవాసదనానికి చేరాల్సి వచ్చిందని తెలియజేస్తుంది. సేవాసదనంలో పాత జీవితం లభించినందుకు సంతోషంగా ఉన్నట్లు చెబుతుంది. ఆ మాటలు విన్న మాణిక్యాలరావు మనసుమారి తనఆస్తిని సేవాసదనానికి రాసి, తాత్కాలికంగా రాజకీయాలకు విరామం పలికి సొంత ఊరికి వెళ్ళాలని నిశ్చయించుకుంటాడు. విషయం తెలిసిన సంపత్ ఆశ్చర్యపోతాడు. సేవాసదనంలో కలిసిన పెద్దావిడ మాణిక్యాలరావు తన తల్లేనని తెలుసుకుని మార్పు చెందిన సంగతి పి.ఎ. సంపత్‌కు తెలియకపోయినప్పటికి రచయిత్రి పాఠకునికి తెలియజేస్తారు.

**సమీక్ష :**

నాయకుడుగా ఎదగాలని అనుకున్నవాడు ఆ అర్హత కోసం ముందు నలుగురితో కలిసి నలుగురి మధ్యన తిరిగి, వారి కష్టసుఖాలను తెలుసుకోగలగాలి అన్న సందేశంతో ఈ కథ సాగింది. రాజకీయం అనే మోజులో పడి సొంత తల్లిదండ్రులను, పుట్టిన ఊరుని మరిచిపోతున్న రాజకీయ నాయకుల హెచ్చరికగా ఈ కథ సాగింది. మానవీయ విలువలు మరిచిన రాజకీయ నాయకులు ఎంతటి నీచానికైనా ఒడిగడతారని ఈ కథలో తెలియజేసారు రచయిత్రి.

మాణాక్యాలరావు రాజకీయంగా ఎదగాలని మంచి వ్యక్తి అయిన భక్తవత్సలం మీద లేనిపోని ఆరోపణలు చేస్తాడు. ఆ ఆరోపణలు నిజం చేయాలని ప్రయత్నిస్తాడు. కానీ భక్తవత్సలం నడిపే సేవాదనంలోనే తన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో తలదాచుకుంటున్నారని తెలిసి సిగ్గుపడతాడు. రాజకీయంగా ఎదిగిన భక్తవత్సలం సొంత ఊరినే మరిచిపోతాడు. అందువల్ల గ్రామంలో ఉన్న తల్లిదండ్రులను ఆ గ్రామస్థులంతా వెలివేస్తారు. గ్రామస్థుల సహకారం లేకపోవడంతో ఒంటరిగా బతికే ఆ దంపతులకు జీవితం దుర్భరమనిపించి సేవాసదనంలో చేరతారు. ఆ విషయం మాణిక్యాలరావు సేవాసదనం లోటుపాట్లను తెలుసుకోవడానికి వచ్చినప్పుడు తెలుసుకుంటాడు. తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపపడతాడు. తల్లి తన తప్పును తెలియజేయడానికి సేవాసదనానికి తనని పిలిచిందని నిర్ధారించుకుంటాడు. తల్లిమాటలు విన్న మాణిక్యాలరావులో మార్పు వస్తుంది. ఇక నుండి ప్రజల మధ్య జీవించాలని నిశ్చయించుకుని ఆ రాజకీయాలకు తాత్కాలిక విరామం తెలిపి స్వగ్రామానికి బయలుదేరతాడు. కన్నతల్లిదండ్రులు సేవాసదనంలో ఉంటున్నారనే విషయాన్ని కూడా తెలుసుకోలేనంతగా కుటిల రాజకీయాలలో కూరుకుపోయిన తనని గుర్తు పట్టి

కూడా గుర్తు పట్టనట్లుగా.. చెప్పకనే చెప్పినట్లుగా తన చేతి స్పర్శతో సందేశం ఇస్తుంది. రాముడమ్మ పాత్ర. మరణశయ్యపై ఉన్న అతని మనస్సాక్షిని బ్రతికించింది అంటారు కథాంతంలో రచయిత్రి.

## 2.3.7 వారసుడు :

కథలో ప్రధాన పాత్ర రామయ్య. రామయ్య భార్య పెళ్ళయిన రెండు సంవత్సరాలకే చనిపోతుంది. భార్య చనిపోయిన తర్వాత రామయ్య మళ్ళీ పెళ్ళి చేసుకోడు. తన ధ్యాస అంతా వ్యవసాయం, వ్యాపారాల మీదే లగ్నం చేసి ఆస్తుల్ని ఇబ్బడిముబ్బడిగా పెంచుతాడు. ఎన్నో సేవాసంస్థల్ని నిర్వహిస్తుంటాడు. రామయ్య తమ్ముడు గోపాలరావుకి వ్యవసాయంలో కలిసిరాదు. అతనికి ముగ్గురు కొడుకులు పెద్దవాడు, రెండవవాడు ఉద్యోగ ప్రయత్నాలలో ఉంటారు. ఆఖరివాడు ఇంటర్‌తో చదువు మానేసి తండ్రికి చేదోడువాదోడుగా ఉంటాడు. పిల్లలులేని రామయ్య తన వ్యవహారాలన్నింటిని సమర్ధంగా నిర్వహించగలిగే ఒకరిని దత్తత తీసుకోవాలని అనుకుంటాడు. ముగ్గురిని రమ్మని ఉత్తరం పంపిస్తాడు. ముగ్గురు బస్సు దిగి ఏటిగట్టు మీదుగా నడుస్తూ రెండవవాడైన శివరావు ఎదురుగా వస్తున్న ఒకాయనను చూసి రామయ్యగారింటికి ఎటు వెళ్లాలి? అని అడుగుతాడు. దేముడు రామయ్య గారిల్లు అంటూ దారి చూపుతాడు. ఇంకొంత దూరం వెళ్ళిన అన్నదమ్ములు సందేహ నివృత్తి కోసం అటుగా వెళ్తున్న వేరొకరిని అడిగితే అతను పిచ్చిరామయ్య ఇల్లు అంటూ దారి చూపిస్తాడు.

రామయ్యను ఒకడు దేముడు అంటే, ఇంకొకడు పిచ్చిరామయ్య అంటున్నాడని సందేహం వెలిబుచ్చుతారు. లేనివాళ్ళ కోసం దానం చేస్తున్నాడని కొందరు దేవుడంటారనీ, వెనకాముందు ఆలోచించకుండా దానధర్మాల చేస్తున్నాడని కొందరు పిచ్చి రామయ్య అంటారని నవ్వుతూ చెప్పి అతను వెళ్ళిపోతాడు.

రామయ్య ముగ్గుర్ని ఆహ్వానించి భోజన సదుపాయాలు ఏర్పాటుచేస్తాడు. మరుసటి రోజు తన ఆస్తిపాస్తులను చూపించటానికి ముగ్గుర్ని వెంటబెట్టుకొని వెళతాడు. తనకున్న పరిశ్రమలతో పాటు, తాను నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలను తెలియజేస్తాడు. రెండు రోజులు గడిచిన తర్వాత రామయ్య, గోపాల్రావులకు తన తాత చేసిన ఆస్తి పంపకం విషయం చెబుతాడు. విలువైన గ్రంథాలున్న పెంకుటిల్లు ఒక భాగంగా, పదెకరాల మాగాణి ఒక భాగంగా పెట్టి ఎవరికేది కావాలో నిర్ణయించుకోమన్నాడని తెలియజేస్తాడు. అతను సమాధానం చెప్పేటంతలో రామయ్య స్నేహితుడు రంగారావు వచ్చి డబ్బు ఉంచమని

చెప్పి అతనిచేతికిచ్చి వెళ్ళిపోతాడు. మరుసటి రోజు అతను చనిపోయిన వార్త తెలుస్తుంది. రంగారావు తనవద్ద దాచినడబ్బు సంగతి ఎవరికీ చెప్పొద్దని తమ్ముడి కొడుకులకు తెలియజేస్తాడు. ఆ మాట విన్న ముగ్గురు ఒకింత ఆశ్చర్యంతో పెదనాన్న ఇంత చెడ్డవాడా పరాయి సొమ్మును ఆశిస్తున్నాడని భావిస్తారు. పెదనాన్న నచ్చ చెప్పితే పెద్దవాడు సత్యమూర్తి, రెండవవాడు శివరావు సమాధానపడతారు. సుందరం మాత్రం అందుకు ఒప్పుకోడు. రామయ్య కోపాన్ని నటిస్తూ నామాట వినకపోతే ఇక బయలుదేరండి అంటాడు. సత్యమూర్తి మాత్రం సుందరాన్ని నిందిస్తారు. తన వల్ల కోటీశ్వరులమే అవకాశాన్ని కోల్పోయామని తిడతారు. సుందరం మౌనంగా ఉండిపోతాడు. రామయ్యపనివాడు వారితో బస్టాప్ దగ్గరకు వచ్చి రామయ్య ఇమ్మన్నాడని చెప్పి ఒక కవరును అందించి వెళ్ళిపోతాడు. బస్సు ఎక్కిన తర్వాత ఆ కవరులోని కాగితాన్ని తీసి ముగ్గురు ఒక్కసారిగా చదవడం ప్రారంభిస్తారు.

తాతయ్య చేసిన ఆస్తి పంపకాలలో రామయ్య, గోపాల్రావు తీసుకున్న విషయం వివరంగా చెబుతాడు. గ్రంథాలు ఉన్న పెంకుటిల్లును రామయ్య తీసుకుంటే, భూముల్ని గోపాల్రావు తీసుకున్నట్లు తెలియజేస్తాడు. గ్రంథాలలో తనకి తన తాత దాచిన వజ్రాల సంచితో పాటు ఒక చీటీ దొరుకుతుంది. మంచి పుస్తకాలు అధ్యయనం చేసిన వాళ్ళు మనసు విశాలం అవుతుంది. జీవితంలో పయనించవలసిన మంచి దారి కన్పిస్తుంది. పుస్తకాల్ని ప్రేమించే నీకు నేను ఇచ్చిన కానుక అని రాసి ఉంటుంది. ఆ వజ్రాల ద్వారా వచ్చిన డబ్బుతో వ్యాపారాలు చేసి మరింతగా సంపాదించి ఇతరులకు వినియోగించాలని భావించి సేవాకార్యక్రమాలు చేస్తున్నాను. ఆ భావన మంచి పుస్తకాల పఠనం వలన కలిగిందని తెలియజేసాడు. ఇప్పుడు ఓపిక తగ్గడం వలన తన వ్యవహారాలను చూసుకోవడానికి ఒక వారసుడు కావాలనిపించి మీకో పరీక్ష పెట్టాను ఆ పరీక్షలో సుందరం నెగ్గాడు అని తెలియజేస్తాడు. ధనప్రలోభానికి లొంగకుండా నిలబడగలగటం చాలా కష్టం. రంగారావు వచ్చి డబ్బు దాయమని ఇవ్వటం, ఆయన చనిపోవటం నేను సృష్టించినదే ఆ పరీక్షలో నెగ్గిన సుందరమే తనకి సరైన వారసుడని తెలియజేసాడు. రామయ్య పరీక్షను పిచ్చి పరీక్ష అనుకుంటారు సత్యమూర్తి, శివరావులు, సుందరం మనసులో ఆయన దేముడు రామయ్యగా కన్పిస్తాడు.

## సమీక్ష :

రచయిత్రి ఎంతో చక్కగా కథాకథనాన్ని నడిపించారు. సహృదయ పాఠకుడికి ఉత్సుకత కలిగించే రీతిలో కథ సాగింది. కథలో ప్రధానమైన పాత్రలు రామయ్య, సుందరం. రామయ్య తన ఆస్తిపాస్తులతోపాటు, సేవాకార్యక్రమాలు చూడటానికి ఒకవారసుని కోసం అతని తమ్ముని బిడ్డలైన సత్యం, శివం, సుందరాలని పిలుస్తాడు. ముగ్గురి యొక్క వ్యవహారశైలి తెలుసుకోవడానికి పెట్టిన పరీక్ష పాఠకుడిని ఆకట్టుకుంటుంది. కథ మధ్యలో అంతర కథగా రామయ్య, గోపాల్రావుల కథ కూడా పుస్తకాల విలువను తెలియజేస్తుంది. విస్తృత పుస్తకపఠనం వలన కలిగే లాభాలను ఈ కథలో వివరిస్తారు. కథలో ఒకానొక సందర్భంలో రచయిత్రి రామయ్యకు అతని తాతయ్య రాసిన లేఖలో పుస్తకాల గొప్పతనాన్ని ఇలా వివరిస్తారు.

"మంచి పుస్తకాల్ని అధ్యయనం చేసిన వాళ్ళ మనసు విశాలం అవుతుంది. జీవితంలో పయనించవలసిన మంచిదారే కనిపిస్తుంది. నిజం అవునో కాదో తెలియదు కానీ నా నమ్మకం ఇది."[46]

రామయ్య అతని తమ్ముడి కొడుకులకు పెట్టిన పరీక్ష పాఠకుడిని ఆలోచింప చేస్తుంది. అప్పటివరకు రామయ్యను గొప్పవాడిగా భావించే పాఠకుడు, రంగారావు డబ్బును కాజేయాలనుకున్న రామయ్య పాత్రను ఈ విధంగా రచయిత్రి తీర్చిదిద్దారేంటని భావిస్తాడు. తర్వాత కథాంతంలో అది రామయ్య కల్పనగా రచయిత్రి సృష్టించినట్లు తెలుసుకున్న పాఠకుడు సంతృప్తి చెందుతాడు.

ధన ప్రలోభం గూర్చి చెబుతూ రచయిత్రి ఒకానొక సందర్భంలో ఇలా అంటారు.

"ఎంతటి స్థిరచిత్తం ఉన్నవాళ్ళనైనా తుఫాను గాలిలా ఊగిసలాటకు సరిచేస్తుంది"[47] నేటికాలంలో సుందరం లాంటి వ్యక్తులు అరుదుగా కన్పిస్తారు. సత్యమూర్తి, శివరావుల వలె పెద్దగా చదువు లేకపోయినా ఉన్నతమైన స్వభావం కలవాడిగా ఈ పాత్రను తీర్చిదిద్దారు. సత్యమూర్తి, శివరావులు రామయ్య పెట్టిన పరీక్షలో ఓడిపోతారు. కానీ ఒత్తిడికి లొంగకుండా, మనస్సాక్షికి విలువనిచ్చినవాడిగా ఉండి పరీక్షలో విజయంసాధిస్తాడు సుందరం.

---

**46. మొగలిపువ్వు కథాసంపుటి – గోగినేని మణి – పుట 115**

**47. మొగలిపువ్వు కథాసంపుటి – గోగినేని మణి – పుట 116**

కుటుంబసభ్యుల ఒత్తిడికిగాని, ధనప్రలోభానికిగానీ లొంగని ధృడమైనమనసు ఉన్నవాడిగా సుందరం కన్పిస్తాడు. రామయ్య ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా మెలిగే వాడిగా ఉండడం చేత సుందరాన్ని తన వారసుడిగా ప్రకటిస్తాడు రామయ్య.

డబ్బుకంటే సమాజంలో విలువలకు ప్రాధాన్యమిచ్చే మనుషులు కరువు అయిపోతున్న నేటి రోజుల్లో రచయిత్రి సమాజంలో మార్పును తేవడం కోసం చక్కటి కథను అందించారు.

## 2.3.8 పుడమి పులకించింది :

రచయిత్రి గోగినేనిమణి రాసిన కథలలో ముందు వరుసలో నిలబడే కథలలో ఇది ఒకటి. రచయిత్రి ఎంతో పరిణతితో ఈ కథను తీర్చిదిద్దారు. ఫ్యాక్షన్ కక్షల వల్ల ఏవిధంగా అమాయకులు బలౌతున్నారో, ఆ బలైన వారి కుటుంబాలు ఏవిధంగా వీధిన పడుతున్నాయో కళ్ళకు కట్టినట్లు సమాజానికి చూపేప్రయత్నం చేసారు. కేశవ అనే ఉపాధ్యాయుడు తరగతిలోని పిల్లలకు కథను చెబుతున్నట్లు కథ సాగుతుంది. ఒక ఊరిలో చిన్న ఇంటిలో తల్లీ, ఇద్దరు కొడుకులు ఉంటారు. తండ్రి పిల్లల చిన్నప్పుడే మరణించటంతో కుటుంబపోషణ భారం తల్లిపై పడుతుంది. సొంత ఆస్తులేమి లేకపోవటం వలన తనకు చేతనైన వంటనే జీవనోపాధిగా చేసుకుంటుంది. రుచికరంగా ఆమె చేసేపచ్చళ్ళు, పిండి వంటలకు బాగానే గిరాకీ ఏర్పడటంతో వాళ్ళ కుటుంబం గడవటానికీ, పిల్లల చదువులకు ఏవిధమైన ఇబ్బంది లేకుండా రోజులు గడుస్తాయి. పిల్లల ఇద్దరి చదువులు పూర్తవుతాయి. పెద్దవాడు సూర్యప్రకాష్ ఉద్యోగంలో చేరతాడు. చంద్రశేఖరం ఉద్యోగ ప్రయత్నాల్లోనే ఉంటాడు. సూర్యం ప్రతినెలా మొదటి ఆదివారం తప్పనిసరిగా తల్లిని, తమ్ముడిని చూడటానికి వస్తుంటాడు. ఒక పూట ఉండడం కోసం ఒక రోజంతా ప్రయాణం చేసుకుని రావడం కష్టం కాదా అని తల్లి ప్రశ్నిస్తే, మీతో కలిసి పండగలా గడిపే ఆనందం కోసం వారంరోజులు ప్రయాణమైనా నాకిష్టమే అంటాడు. కానీ ఆఆనందం ఎంతో కాలం నిలవదు. మరుసటి నెల మొదటి ఆదివారం నాడు సూర్యప్రకాష్ రావడం ఆలస్యం కావడంతో చంద్రశేఖరం బస్టాండ్‌కు బయలుదేరుతాడు. మార్గమధ్యలో అతనికి కనిపించిన దృశ్యం బిగుసుకుపోయేటట్లు చేస్తుంది. రక్తపుమడుగులో అన్నయ్య కొట్టుమిట్టాడుతుంటే చంద్రశేఖర్ తట్టుకోలేడు. సూర్యప్రకాష్ స్నేహితుడు నాగేంద్ర జీపులో వస్తుంటే నాగేంద్ర శత్రువు భూపతిరావు జీపును వెంబడించి అందరిని చంపేస్తాడు. తనకేం తెలియదని అంటున్నా సూర్యప్రకాష్ మాట వినిపించుకోకుండా అతడిని వదలరు. ఇదంతా కొనూపిరితోనే తమ్ముడితో చెప్పి తుదిశ్వాస విడుస్తాడు.

చంద్రశేఖరం భూపతిరావు మీద కక్ష పెంచుకుంటాడు. కోర్టులకు, చట్టాలకు దొరకని భూపతిరావును ఉపాయంతో చంపి అన్న ఆత్మకు శాంతి చేకూర్చుతానని ప్రతిజ్ఞ పూనుతాడు. భూపతిరావు కొడుక్కి ఇంటి వద్దనే పాఠాలు చెప్పే రామయ్యగారితో పరిచయం పెంచుకుని అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉంటాడు. ఒకనాడు రామయ్య పనిమీద పదిరోజులు వేరే ఊరికి వెళ్ళాల్సి రావడంతో చంద్రశేఖర్‌ని పాఠం చెప్పమని పంపిస్తాడు. భూపతిరావును చంపే అవకాశం దొరికిందని ఆనందంతో ఒప్పుకుంటాడు చంద్రశేఖర్. భూపతిరావు కొడుకు ప్రశాంత్‌కి పాఠాలు చెబుతూనే అంతా గమనిస్తుంటాడు. సరైన అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉంటాడు. కానీ ప్రశాంత్ తండ్రి వలె కాకుండా తెలివితేటలు, నిర్మలమైన చూపులు, చదువు పట్ల శ్రద్ధాసక్తులూ కలవాడిగా చంద్రశేఖర్‌కి కన్పిస్తాడు. అందుకే ప్రశాంత్ అంటే అతనికి ఇష్టాన్ని కలిగిస్తుంది. కానీ అతని తండ్రి పట్ల ప్రతీకార వాంఛతోనే ఉంటాడు. తన పనిని తొందరగా ముగించాలనుకుంటాడు. ఒక రోజు పాఠం చెబుతూనే పరధ్యానంగా ఉన్న చంద్రశేఖరాన్ని గమనించిన ప్రశాంత్ ఒంట్లో బాగాలేకపోతే విశ్రాంతి తీసుకోండి మాష్టారు అని అంటాడు. అంత చిన్న పిల్లాడిలో వయసుకు మించిన పరిణతి చూసి చంద్రశేఖర్ విస్మయం చెందుతాడు. చంద్రశేఖర్ ప్రశాంత్‌కి కథరూపంలో తన జీవిత గాథను చెబుతాడు. కథ విన్న ప్రశాంత్ ఇది మీకథే కదూ అంటాడు. ఎలా తెలుసుకున్నావు అని చంద్రశేఖర్ ప్రశ్నిస్తాడు. అన్నయ్య చనిపోయిన దుఃఖం మీకళ్ళలో కన్పిస్తుంది అని అంటాడు. తన తండ్రిని చంపడానికి వచ్చారా అని అడుగుతాడు. ప్రశాంత్ మాటలు విన్న చంద్రశేఖర్ అవునని అంటాడు. నీ తెలివితేటల్ని మెచ్చుకోవల్సింది కానీ ఆ తండ్రి దగ్గరకు తీసుకువెళ్ళకపోతే నిన్ను కూడా కాల్చేస్తాను అంటాడు. చావంటే తనకు భయం లేదని ఇలాంటి స్వేచ్ఛలేని జీవితం గడపడం కంటే మరణించటమే మేలు. అనుక్షణం భయంతో బతకడం వ్యర్థం అంటాడు. తప్పు చేసిన వాళ్ళకి శిక్ష పడాల్సిందే కానీ మీపగ కోసం తప్పు చేయని అమ్మను, నన్ను శిక్షిస్తామంటున్నారు ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నిస్తాడు.

ప్రశాంత్ మాటలు అర్థం కానట్లు అయోమయంగా చూస్తాడు. మిమ్మల్ని చంపుతానని అనలేదుగా అని అంటాడు. చావంటే చిటికెలో ప్రాణం పోతుంది. కష్టము, సుఖము ఏమి తెలియని ప్రశాంతమైన నిద్రవస్థ! భర్త ఎడబాటులో అమ్మ, తండ్రి అండలేకుండా నేను జీవితాంతం శిక్ష అనుభవించాలి. మీ కుటుంబం అనుభవించిన వేదనే నాన్న కూడా అనుభవించాలంటే మీరు చంపాల్సింది నన్ను అంటాడు. ప్రశాంత్ తన మాటలతో చంద్రశేఖర్‌ని మంత్రముగ్ధుడిని చేస్తాడు. పగ నిప్పులాంటిదనీ, ప్రేమ అమృతమని, పిల్లలకు

నైతిక విలువలు బోధించే కథలు ఉపాధ్యాయులు తెప్పాలి అని, ఒకరినొకరు చంపుకుంటూపోతే భూమి ఒకనాటికి శ్మశానంగా మారుతుందని పరిపరివిధాలుగా తెలియచేస్తాడు. ఆ మాటలకు చంద్రశేఖర్ మైమరచిపోతాడు. చేతిలోని ఆయుధాన్నివిసిరేసి ప్రశాంత్‌ని కౌగిలించుకుంటాడు.

ఆయుధం విసిరిన శబ్దం విని భూపతిరావు అక్కడికి చేరుకుంటాడు. భూపతిరావుకు తాను వచ్చిన విషయం నిజాయితీగాచెప్పి తనకి ఒకగంట అవకాశం ఇవ్వమని ప్రాధేయపడతాడు. ఎందుకని అడిగితే తన తల్లిని చంపి వస్తానని తెలియజేస్తాడు. తను లేకుండా ఒంటరిగా తన తల్లి బతకలేదని తెలియజేస్తాడు. చంద్రశేఖరం మాటలు వింటూ భూపతిరావు నిశ్చేష్టుడౌతాడు. భూపతిరావులో మార్పు వస్తుంది. అతని జీవిత పంధాను మార్చుకుంటాడు. తన భూములలో సగం అనుచరలికిస్తాడు. తన గ్రామంలో సౌకర్యాలను ఏర్పాటు చేస్తాడు.

చంపడంలో కాదు ప్రేమనుపంచడంలో మాత్రమే హీరోయిజం ఉందని తెలియజేస్తాడు.

**సమీక్ష :**

నేటితరం సినిమాల ప్రభావం పసిపిల్లలపై అధికంగా పడుతుంది. అటువంటి ఇతివృత్తాన్నే తీసుకుని చక్కటి కథగా మలిచారు రచయిత్రి. కథా ప్రారంభమే సినిమా డైలాగులతో ప్రారంభమౌతుంది.

***"అమ్మతోడు... అడ్డంగా నరుకుతా!"***
***"కత్తితో కాదు... కంటి చూపుతో చంపుతా!"***
***"నే తొడగొట్టానంటే... ఆ సౌండ్‌కే చస్తావ్"***[48]

అంటూ పాఠశాలలో పిల్లలు సినిమా డైలాగులు చెప్పడంతో కథను ప్రారంభిస్తారు రచయిత్రి. నేటితరం పిల్లలపై సినిమాలప్రభావం ఏవిధంగా ఉందో తెలియదనే ఉద్దేశంతో రచయిత్రి ఈకథను రాసినట్లనిపిస్తుంది. అటువంటి పిల్లలకు కేశవ అనే ఉపాధ్యాయుడు ఒకకథ చెబుతానంటాడు. ఆ పిల్లలలో ఒకడు కథ కత్తిలా ఉండాలి అని

48. మొగలిపువ్వు కథాసంపుటి – గోగినేని మణి – పుట 126

అంటాడు. కత్తికి బాబు బాంబులా ఉంటుంది అని అంటాడు కేశవ. పిల్లల ఆలోచనా ధోరణిని మార్చడం కోసం ఉపాధ్యాయులు తమ వంతు ప్రయత్నం చేయాలని ఈ కథ ద్వారా తెలియజేస్తారు రచయిత్రి.

కేశవ స్నేహితుడు కథల వల్ల మనుష్యులు మహాత్ములౌతారా అని ప్రశ్నిస్తాడు.

"నిజమే కథల వల్ల ఎవరూ మహాత్ములైపోరు... అలా అవ్వాల్సిన అవసరము లేదు! మనిషి మనిషిగా బ్రతికితే చాలు... ఆ సమాజం బాగుంటుంది! ఒక మంచి కథ పదునైన ఆయుధంలా మనసులో మథనాన్ని సృష్టిస్తుంది. ఆలోచనల్ని రేకెత్తిస్తుంది. మంచిమార్గాన్ని చూపిస్తుంది. నైతిక విలువల్ని ప్రభోధించే మంచి కథల వలన కొంత మేరకైనా ప్రయోజనం ఉంటుందని"[49] రచయిత నమ్మకం.

ఫ్యాక్షన్ గొడవలో నిష్కారణంగా అన్నను కోల్పోయిన తమ్ముడు తన అన్నని చంపిన వాడిని చంపాలని నిశ్చయించుకుంటాడు. అదునుకోసం చూస్తుంటాడు. అదును చిక్కే సమయంలో అతను చంపాలనుకునేవాడి కొడుకు ద్వారా అతనికి జ్ఞానోదయం అవుతుంది. కథలో ఫ్యాక్షనిస్ట్ కొడుకు ప్రశాంత్ పాత్రను ఎంతో అమోఘంగా తీర్చిదిద్దారు రచయిత్రి. ప్రశాంత్ చేత ఎన్నో గొప్పమాటలు పలికిస్తారు.

చంద్రశేఖరం ప్రశాంత్‌తో నీ జీవితం వడ్డించిన విస్తరి కదా! అని అంటే

"వడ్డించిన విస్తరి ముందు కూర్చోటం కంటే మనకిష్టమైనవి కష్టపడి వండుకుని తినటంలోనే ఆనందముంటుంది కదా సార్"[50] అని అంటాడు.

***ఒకానొక సందర్భంలో నైతిక విలువలను గూర్చి చెబుతూ***

"పర్యావరణం, ప్రాజెక్టులు, జలాశయాలు ఇవన్నీ మనకి ఎంత అవసరమో అంకంటే ఎక్కువగా నైతిక విలువల పరిరక్షణా ముఖ్యమే! అందుకే నైతిక విలువల్ని పెంచే, మంచి ఆలోచనల్ని కలిగించే కథల్ని పిల్లలకు తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులు చెప్పాలి! నేర రహితమైన నందనవనంలాంటి సమాజ స్థాపనకు ఇది ఒక మార్గమంటారు."[51]

.................................................................................................

**49. మొగలిపువ్వు కథాసంపుటి – గోగినేని మణి – పుట 128**

**50. మొగలిపువ్వు కథాసంపుటి – గోగినేని మణి – పుట 132**

**51. మొగలిపువ్వు కథాసంపుటి – గోగినేని మణి – పుట 134**

***కథాంతంలో సమాజంలో మార్పును ఆశించిన రచయిత్రి కేశవరావుపాత్రతో ఇలా అన్పిస్తారు.***

"పగలు ప్రతికారులకు స్వస్తి పలికి మంచితనపు మహావృక్షాలతో తనను నందనవనంగా మరుస్తారనే ఆశతో, నమ్మకంతో భూమాత పులకించి పోయుంటుంది"

నేటి బాలలే రేపటి పౌరులు అటువంటి పౌరులను తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులు బాధ్యాతాయుతంగా లేకపోతే ఒక తరాన్ని నాశనం చేసిన వారవుతారు అన్న ఉద్దేశ్యంతో రచయిత్రి ఎంతో లోతుగా అధ్యయనం చేసి ఈకథను రాసారు. కేశవరావులాంటి ఉపాధ్యాయులు ఉన్ననాడు నిజంగా ఈ పుడమి పులకించి పోతుంది అనుటలో సందేహం లేదు. సమాజంలోని మానవీయ కోణాన్ని రచయిత్రి దర్శించిన తీరు అద్భుతం.

## 2.3.9 పిచ్చుకగూడు :

నేటి సమాజంలో సంబంధాలన్నీ ఆర్థికపరమైనవే. డబ్బుకి ఇచ్చిన విలువ మనుషులకు లేదు. అటువంటి మానవ విలువలు లోపించిన కథ పిచ్చుకగూడు. మాధవరావు సీతారంపురంలో ఉన్న తన పిచ్చుకగూడు గృహప్రవేశానికి ఆహ్వానిస్తూ చిన్ననాటి స్నేహితులకు లేఖ రాస్తాడు. ఆ ఉత్తరం చదవగానే మాధవరావుకు ఆ పరిస్థితి ఎందుకు కలిగిందో తెలుసుకోవాలనే ఉద్దేశంతో అందరికన్నా ముందుగా ఒక స్నేహితుడు వచ్చి అక్కడ అన్ని సౌకర్యాలు బాగానే ఉన్నాయని నిర్ధారించుకున్నాక, నీవు ఈ ఉత్తరం రాయడానికి కారణమేమిటని మాధవరావును అడుగుతాడు అప్పుడు మాధవరావు తనకు ఎదురైన సంఘటనలన్నీ చెబుతాడు.

వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తనను హైదరాబాదులో ఉన్న తన కొడుకు ఊరిలో ఒంటరిగా ఉండడం ఎందుకని తన దగ్గరకి రమ్మని తీసుకువెళతాడు. వెళ్ళిన మొదట్లో తన కొడుకు మంచివాడని నమ్మిన మాధవరావుకు రానురాను నమ్మకం పోతుంది. తనకు ఇష్టం లేకపోయినా కొడుకు పని నిమిత్తం ఒక పల్లెటూరు వెళుతూ మార్గమధ్యలో ధర్మాపురంలో భోజనం చేయడం కోసమని ఆగి, ఎదురుగా ఉన్న 'పాపమ్మగారి అన్నప్రసాదశాలకు వెళతాడు. భోజనం చేశాక డబ్బులు ఇవ్వబోతుండగా మేము పౌరుగూరు వారి దగ్గర డబ్బులు తీసుకోమని చెబుతారు. మాఊరిలో ఇటువంటి సౌకర్యాలు చాలానే ఉన్నాయని, వాటన్నింటికీ మూలమైన ధర్మన్న గురించి చెబుతారు.

అటువంటి పెద్దమనిషిని గురించి తెలుసుకోవడం కోసమని మాధవరావు ధర్మన్న ఇంటికి వెళ్ళి, అతనిని కలుసుకొని ఇంతపేరున్న మీరు పిచ్చుకగూడులాంటి చిన్న ఇంట్లో ఉండడం ఆశ్చర్యంగా ఉందంటాడు. పిచ్చుక తను ఉండడానికి సరిపోయేంత మాత్రమే ఇల్లు కట్టుకుంటుంది. మనిషి కూడా పిచ్చుకవలే తనకు కావాల్సినంత మాత్రమే సంపాదించుకుంటే బాగుంటుందని, ఆ విషయంలో పిచ్చుకను ఆదర్శంగా తీసుకున్నాని ధర్మన్న మాధవరావుతో చెబుతాడు.

మీరు ఇవన్నీ చేయడానికి స్ఫూర్తి ఎవరని మాధవరావు అడగగా ధర్మన్న తన చిన్నతనం నుండీ ఎదురైన అనుభవాలను చెబుతూ పుట్టుకలో పదవిలో తేడాలు ఉండవచ్చుగానీ, మనుషులుగా మాత్రం అంతా ఒక్కటేనన్న నిజం నేను మనస్ఫూర్తిగా నమ్మానని చెబుతాడు. అంతేకాకుండా పాపమ్మగారి అన్నప్రసాదశాల, గోపన్నగారి పశు సంరక్షణశాలలకు ఆ పేర్లు పెట్టడానికి కారణాలను మాధవరావుకు చెబుతాడు. ధర్మన్న చేపట్టిన కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని తనకు నచ్చినదారిలో నడవగలిగే స్వేచ్ఛను సంపాదించుకోగలిగానని తన స్నేహితునికి మాధవరావు వివరిస్తాడు తన పాత ఇంటికి మరమ్మత్తులు చేయించి కొంతమంది అనాధలను పోషిస్తూ, వారితోనే బంధుత్వం ఏర్పాటు చేసుకొని చాలా ఆనంతంగా ఉన్నానని మాధవరావు చెప్పగా తన స్నేహితుడు చాలా సంతోషిస్తాడు.

## సమీక్ష :

పిచ్చుకగూడు కథను రచయిత్రి ఉత్తమపురుషలో రచించారు. మాధవరావు, ధర్మన్న పాత్రలు ఈ కథలో ప్రధానంగా ఉంటాయి. ధర్మన్న చెప్పిన మంచి విషయాలను స్ఫూర్తిగా తీసుకొని మాధవరావు అనుసరిస్తాడు. అందుకనే తన ఇంటికి పిచ్చుకగూడు అని పేరు పెట్టుకుంటాడు. ఈ కథకు పిచ్చుకగూడు అను శీర్షిక పెట్టడానికి ప్రధాన కారణం "పిచ్చుక చిన్న ప్రాణి. పుల్ల, పుడక ఏరుకొచ్చి తన కష్టంతో తనకి సరిపోయేంత చిన్నగూడు కట్టుకుంటుంది. పిచ్చుక నిరాడంబరతకు చిహ్నం. ఏమనిషైనా పిచ్చుకను ఆదర్శంగా తీసుకుంటే జీవితం సమస్యలమయం కాకుండా సుఖంగా సాగిపోతుంది. విలాసాలు, ఆడంబరాలపట్ల మోజు పెంచుకోవడం వల్లే మనుషులు ఎన్ని అడ్డదారులైనా తొక్కి డబ్బు సంపాదించుకుంటున్నారని" ధర్మన్న పాత్రద్వారా రచయిత్రి మాధవరావుకు వివరిస్తారు. అవసరానికి మించి అదనంగా ఏదీ ఉండకూడదని, ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, సగటు

మనిషి జీవనానికి సరపడా మాత్రమే ఉంచుకోవాలని, మిగిలినది పరుల కొరకు ఉపయోగించాలని రచయిత్రి ఈ శీర్షిక ద్వారా తెలియజేశారు.[52]

తన విషయంలో కుమారుడు ప్రవర్తించిన తీరును గురించి మాధవరావు తన స్నేహితునితో చెబుతాడు. సీతారాంపురంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మాధవరావును తన కొడుకు హైదరాబాద్ తీసుకువెళ్ళిపోతాడు. వ్యాపారం చేసుకుంటూ బాగా సంపాదించి రాజకీయాలలోకి ప్రవేశించాలనుకుంటున్నాని మాధవరావుతో తనకొడుకు చెబుతాడు. రాజకీయాల బురదలో దిగడం ఎందుకని తండ్రి చెప్పినా వినిపించుకోడు.

అందరూ అలా అనుకుంటే ఎలా నాన్నా, సమర్థులూ, నిజాయితీపరులూ రాజకీయాల్లోకి వస్తేనే కదా సమాజం బాగుపడుతుందని మాధవరావుతో తన కొడుకు చెబుతాడు. నమ్మిన సిద్ధాంతాలను వదులుకోవలసివస్తే నేను కూడా తాతగారిలాగే రాజకీయాలనుండి తప్పుకుంటానని తన తండ్రిని ఒప్పిస్తాడు. కొన్నిరోజుల తరువాత తన కొడుకు అనుసరించే పద్ధతి సరైనది కాదని మందలిస్తే మౌనంగా వినేవాడు. రానురాను ఏదైన చెప్పబోతే మీకెందుకు నాన్న ఈ విషయాలు విశ్రాంతి తీసుకో అని కాలీగా ఉన్న గదిలోకి మాధవరావు బస మారుస్తాడు. అప్పటి నుండి మాధవరావు పైకి కనిపించని సంకెళ్ళతో తనకు నచ్చని, రుచించని వాతావరణంలో బంధీనయ్యానని ప్రతీక్షణం బాధపడుతూనే ఉంటాడు. తనకి నచ్చినట్లు జీవించే స్వేచ్ఛను పూర్తిగా కోల్పోతాడు. ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులమాట వినకుండా, వారిచ్చే సూచనలును పట్టించుకోకుండా, వారికి స్వేచ్ఛనివ్వకుండా ఉన్న మాధవరావు కొడుకులాంటివారు ఎందరో ఉన్నారని రచయిత్రి ఈ కథలో వివరించారు.

మాధవరావు తన కొడుకు ప్రయోజనం కోసం భూమి కొనుగోలుకు సలహాదారునిగా వెళుతూ మార్గమధ్యలో పాపమ్మగారి అన్నప్రసాదశాలకు వెళ్లి భోజనం చేశాక డబ్బులు ఇస్తే తీసుకోరు. ఎందుకని అడగగా ఇక్కడ పొరుగూరు నుండి వచ్చినవారికి ఉచితమని చెబుతారు. అక్కడికి దగ్గరలో గోపన్నగారి పశుసంరక్షణశాల కూడా ఉంటుంది. ఇటువంటి సేవాకార్యక్రమాలన్నింటికీ ఆ గ్రామపెద్ద ధర్మన్న అని తెలుసుకొని అతని దగ్గరకి వెళ్ళి, ధర్మన్న ఉన్న ఇల్లుని చూసి, ఊరంతటికీ ధనవంతులైన మీరు ఇంత చిన్న పిచ్చుకగూడులాంటి ఇంట్లో ఉండడం ఆశ్చర్యంగా ఉందని మాధవరావు అడుగుతాడు. వెంటనే ధర్మన్న

52. పిచ్చుకగూడు కథాసంపుటి – పిచ్చుకగూడు కథ – పుట 24

"మేమిద్దరం, మామనవడితో కలిసి మూడు పిచ్చుకలం ఈ గూడులో ఉంటున్నాం. మాకు ఈమాత్రం సరిపోదా! ఇంకా పెద్దగూడు ఎందుకండీ? అవసరానికి మించి అదనంగా ఏదీ ఉండకూడదనేది నా సిద్ధాంతమని మాధవరావుకి వివరిస్తాడు". [53]

మీలో ఇలాంటి ఆశ, ఆశయం ఏర్పడడానికి కారణం, స్ఫూర్తి ఎవరని మాధవరావు అడగగా, ధర్మన్న తన చిన్నతనంలో నాన్న చెప్పిన మంచి విషయాలను గురించి చెబుతాడు. గోపన్న, పాపమ్మలు మీతల్లిదండ్రులా అని ధర్మన్నను మాధవరావు అడగగా కాదని చెబుతాడు. "ఒకసారి నేను మా అబ్బాయీ పశువులను కొనడానికి పొరుగూరు సంతకి వెళ్ళాం. అక్కడ ఒక చోట నీడపట్టున కారు ఆపి, అటూ ఇటూ చూస్తున్నప్పుడు చిన్నగట్టు మీద తట్టలు మోసే అవ్వ కూర్చొని అన్నం క్యారేజి విప్పడం గమనించాను. రెండు ముద్దలు పూర్తిగా తినకుండానే కొంచెం దూరంలో కూర్చున్న పిల్లాడిని పిలిచి అన్నం తినమంది. వాడు పూర్తిగా తినేసి గెంతుకుంటూ వెళ్ళిపోయాడు. నేను ఆసక్తితో అదేంటమ్మా నువ్వేం తినకుండానే ఆ పిల్లాడికి పెట్టావెందుకు, నీ మనవడా? అని అడగగా... కాదు బాబూ ఎవరో నాకు తెలియదు. వాడు నావైపూ, అన్నం గిన్నెవైపూ ఎంత ఆకలిగా చూస్తున్నాడో గమనించాక తినబుద్ధి కాలేదు. ఆకలి తీరాక ఎంత ఆనందంగా పరుగెత్తాడో చూశారు కదా. ఇప్పుడు నాకు కడుపు నిండినట్లే ఉందని అవ్వ చెప్పగా విని, ఆమె స్ఫూర్తితో ధర్మాపురంలో ఆమె పేరుతో "పాపమ్మగారి అన్నప్రసాదశాల"[54]ను ఏర్పాటుచేసి, ఆమెతోనే ప్రారంభం చేయించానని ధర్మన్న మాధవరావుతో చెబుతాడు. దాచుకోవడం కంటే పంచుకోవడంలోనే ఆనందం ఉందనే మంచితత్వాన్ని పాపమ్మపాత్ర ద్వారా రచయిత్రి వివరించారు.

ఎక్కడికో వెళ్ళివస్తున్న ధర్మన్న పక్క ఊరిలో భార్యాభర్తల మధ్య గొడవను చూసి, దానికి కారణం తెలుసుకుంటాడు. ముసలి ఎద్దునూ, ఆవునూ అమ్మొద్దని గోపన్న అడ్డుపడతాడు. మనుషులకే తిండి లేకపోతుంటే వీటిని ఎలా పోషించాలని గోపన్న భార్య ధర్మన్నతో చెబుతుంది. గోపన్నకు పశువులపట్ల ఉన్న ప్రేమాభిమానాలు చూసి తప్పని పరిస్థితుల్లో ఆ రెండింటినీ వారి దగ్గర నుండి కొని ఆ స్ఫూర్తితో "గోపన్న పశుసంరక్షణశాల"ను ఏర్పాటు చేస్తాడు.

---

**53. పిచ్చుకగూడు కథాసంపుటి – పిచ్చుకగూడు కథ – పుట 24**

**54. పిచ్చుకగూడు కథాసంపుటి – పిచ్చుకగూడు కథ – పుట 25**

ధర్మన్న చేసిన అనేక మంచి కార్యక్రమాలను గురించి తెలుసుకొని మాధవరావు సంతోషిస్తాడు. ధర్మన్న మనుమరాలు "సంతృప్తి అనే తరువుకి మాత్రమే సంతోష సుమాలు పూస్తాయని" తనకు రాసిన ఉత్తరంలో తెలిపిందని మాధవరావుకి చెబుతాడు. సంతృప్తి చెంది సర్దుకొని ఉండిపోతే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని మాధవరావు అడగగా... సంతృప్తి, శ్రమజీవనం రెండు జోడుగుర్రాలుగా బతుకుబండిని లాగాలి. అప్పుడే అభివృద్ధి, ఆనందం మన సొంతమవుతాయని ధర్మన్న వివరిస్తాడు. తన సమస్యలన్నింటికీ పరిష్కారం దొరకడంలో తనకి నచ్చినదారిలో నడవగలిగేస్వేచ్ఛను సంపాదించుకొని మాధవరావు ఊరిలో తన ఇంటికి మరమ్మత్తులు చేయించి, ఏతోడూ లేని అనాధలను, పేదవారిని తన కుటుంబంగా ఏర్పాటు చేసుకొని సంతోషంగా జీవనం సాగిస్తాడు. సమాజంలో కొంతమంది వ్యక్తులను కలవడం, వారు చేసిన మంచి కార్యక్రమాలను తెలుసుకోవడం వలన ప్రతీ ఒక్కరిలో మార్పు వస్తుందని రచయిత్రి మాధవరావు పాత్ర ద్వారా తెలియజేశారు.

## 2.3.10 పాలవెల్లి :

ఇంట్లో జరిగే శుభకార్యాలకు బంధువులను, స్నేహితులను పిలిచి సంబరంగా జరుపుకోవడం హిందూ సాంప్రదాయంలో అనాదిగా వస్తున్న ఆచారం. నేటి సమాజం అటువంటి ఆచారాలను, సంప్రదాయాలను పెద్దగా అవలంభించుటలేదు. నాటి సంప్రదాయాలను జ్ఞప్తికి తెస్తూ రచయిత్రి రాసిన మానవ విలువలకు సంబంధించిన కథ పాలవెల్లి. కథలో ప్రధానపాత్ర పట్టాభిరామ్. పట్టాభిరామ్ కూతురి పెళ్ళికి అందరిని ఆహ్వానిస్తాడు. కూతురి పెళ్ళిని మునుపటి రోజుల్లోలా బంధుమిత్రులందరితో కలసి ఓ వారంరోజుల పాటు సరదాగా గడిపేటట్లుగా జరిపించాలని తన తమ్ముళ్ళైన లక్ష్మణ్, భరత్ కుమార్‌లతో చెబుతాడు. అన్నయ్య కోరిక తీర్చే బాధ్యత తమ్ముళ్ళిద్దరూ తీసుకుంటారు. తమ ఉద్యోగాలకు నెలరోజులు సెలవు పెట్టి వస్తారు. పెళ్ళి వారంరోజులు ఉండగానే ఏదో ఒక వేడుక చేస్తూ రోజుకి వంద విస్తళ్ళు వేస్తుంటారు. చుట్టాలందరూ కూడా తలోపని చేస్తుంటారు. అందరికి సందడిగానే ఉందితప్ప శ్రమగా ఎవరూ భావించరు. చుట్టాలు తమతో పాటు వాళ్ళు పండించే కూరగాయలు, వాళ్ల పశువుల ద్వారా వచ్చే పాలు, పెరుగు వంటి పదార్ధాలు కూడా తెస్తారు.

పట్టాభి స్నేహితుడు ముహూర్తం ముందురోజు వస్తాడు. రావడం ఆలస్యం అయినందుకు స్నేహితుడిని పట్టాభి అప్యాయంతో కోపగించుకుంటాడు. పట్టాభి స్నేహితుడు పెళ్ళి ఏర్పాట్లు చూసి ఆశ్చర్యానికి లోనవుతాడు. పాతకాలాన్ని జ్ఞాపకానికి తెచ్చేలా

ఆ ఏర్పాట్లు ఉంటాయి. పట్టాభి తమ్ముడు లక్ష్మణ్ అతని వసతి ఏర్పాట్లు చూస్తాడు. కుశల ప్రశ్నలు వేస్తాడు. అతనికి పెళ్ళి వంటల సువాసనలు ఆకలిని కలిగిస్తాయి. సాంప్రదాయక వంటలు అతణ్ణి ఆహ్వానం పలుకుతాయి. చాలారోజులకు సంతృప్తిగా తిన్న పెళ్ళిభోజనం ఇదేనని మెచ్చుకుంటాడు. పట్టాభి స్నేహితుడు ఒక్క క్షణం స్వగతంలోకి జారుకుంటాడు.

తండ్రి చనిపోవటంతో పట్టాభి హైస్కూలులో చదువును ఆపేసి వ్యవసాయాన్ని, కుటుంబ పోషణ భారాన్ని తన భుజాలకెత్తుకుంటాడు. తమ్ముళ్ళు చదువులు, పెళ్లిళ్లు తానే బాధ్యతతో పూర్తి చేస్తాడు. స్వశక్తితో తండ్రి ఇచ్చిన పదెకరాల వ్యవసాయాన్ని, ఇరవై ఎకరాలకు పెంచుతాడు. తమ్ముళ్ళిద్దరూ పెద్ద పెద్ద ఉద్యోగాల్లో స్థిరపడతారు. ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా సవ్యంగా సాగడానికి కారణం పట్టాభి మంచితనమే. ఇటువంటి వ్యక్తులు చాలా అరుదుగా కనబడతారని అతని స్నేహితుడు పాతకాలపు జ్ఞాపకాలన్నీ నెమరువేసుకుంటాడు.

తన కుటుంబానికి తన స్నేహితుని కుటుంబానికి ఉన్న వ్యత్యాసాన్ని గమనించి బాధపడతాడు పట్టాభి స్నేహితుడు. ఆస్తి తగాదాలవలన సోదరులతో సత్సంబంధాలు ఉండవు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారిన నేటిరోజుల్లో పట్టాభిలాంటి వ్యక్తిత్వం ఉన్న మనుషులు చాలా అరుదుగా ఉంటారు. మనుషుల మధ్య సంబంధ బాంధవ్యాలు సజావుగా సాగటానికి కొన్ని జాగ్రత్తలు తప్పవని అంటాడు. సోదరుల మధ్య అపోహలు లేకుండా ఉండాలంటే ఆర్థిక సంబంధ వ్యవహారాల్లో తేటతెల్లంగా ఉండాలని భావిస్తాడు పట్టాభి. పొరుగూరి రైతుకిచ్చిన అప్పు మూడు లక్షలు అతను చెల్లిస్తాను అంటే తన రైసు మిల్లు గుమస్తాను పంపిస్తాడు. గుమస్తా ఆ డబ్బుతో పరారవుతాడు. కూతురి పెళ్ళి కోసం కట్నంగా ఇద్దామనుకున్న డబ్బుతో గుమస్తా పారిపోవడంతో పట్టాభికి దిక్కుతోచదు. ఎవరి దగ్గరా అప్పు తీసుకోవడం అతనికి ఇష్టంలేక మౌనంగా ఉంటాడు. అది గమనించిన అతని స్నేహితుడు విషయాన్ని పట్టాభి సోదరులతో చెబుతాడు. అతని సోదరులు మారు మాటలేకుండా చెరొక మూడు లక్షలకు చెక్కురాసి అందిస్తారు. అన్నయ్య నుండి ఎప్పుడూ తీసుకోవటమేగాని ఏనాడు అన్నయ్యకు ఇచ్చే అవకాశం కాలేదు. నేడు అన్నయ్యకు ఇవ్వగల అవకాశం దొరికింది అని అంటారు. అన్నయ్య కూతురు మా కూతురు కాదా అని అనేసరికి పట్టాభి స్నేహతుడు ఆశ్చర్యపోతాడు.

తరువాత గుమస్తా వచ్చి డబ్బు ఇచ్చిన సంగతి తెలిసి తను కావాలనే ఈనాటకం ఆడానని, అన్నదమ్ముల అనుబంధానికి మీరు నిలువెత్తు నిదర్శనాలని పట్టాభి స్నేహితుడంటాడు. పెళ్ళికొడుకుతో డబ్బు అందలేదని నాటకమాడితే తాను పెళ్ళి చేసుకోబోయేది అమ్మాయినే కాని డబ్బుని కాదు. డబ్బు ఇవ్వకపోయినా పరవాలేదని పెళ్ళికొడుకు అంటాడు. ఆ మాటలు విన్న పట్టాభి స్నేహితుడు ఆశ్చర్యపోతాడు. డబ్బుకే ప్రాధాన్యమిచ్చే నేటి సమాజంలో ఇంతటి ఆదర్శభావాలు గల యువకుడు అల్లుడుగా దొరకడం పట్టాభి అదృష్టం అని భావిస్తాడు. ఇటువంటి కుటుంబాలు కొన్ని ఉన్నా ఆ ఊరు పచ్చగా, పాలవెల్లిలా కళకళలాడుతుంది అని అనుకుంటాడు.

## సమీక్ష :

మానవసంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలు కావని తెలియజేయడమే ఈ కథ యొక్క ముఖ్య ఉద్దేశం. కథలో పట్టాభి, లక్ష్మణ్, భరత్ ముగ్గురు అన్నదమ్ములు, వీరి బాంధవ్యంను పరీక్షించదలచి పట్టాభి స్నేహితుడు ఆడిన నాటకంలో వీరి ఔన్నత్యం అతనికి తెలుస్తుంది. ఒకరికోసం ఒకరుగా ఉన్ననాడు ఆ సంబంధాలు ఎన్నడూ చెడిపోవు. తమ్ముళ్ళ కోసం అన్న చేసిన త్యాగం, అన్నయ్యకు డబ్బులు అవసరం పడినప్పుడు వారిచ్చినట్లు తెలియకుండా తమ్ముళ్ళు అన్నకు ఇవ్వమని అన్న స్నేహితునితో చెప్పడం పట్టాభి స్నేహితునికే కాదు, పాఠకునికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇంతటి ఆదర్శవంతమైన గుణాలు కలిగిన వ్యక్తులు సమాజంలో అరుదుగా తారసపడుతుంటారు. ఈ కథ ద్వారా సమాజానికి చక్కటి సందేశాన్నిచ్చారు.

ఉమ్మడి కుటుంబవ్యవస్థ విచ్ఛిన్నమై సంబంధబాంధవ్యాలకు దూరమై కపట ప్రేమను నటిస్తున్న నేటి తరానికి మేలుకొలుపుగా ఈ కథ ఉంది. కథాంతంలో పట్టాభి స్నేహితుని పాత్ర ద్వారా "మీలాంటి కుటుంబాలు కొన్ని ఉన్నాసరే, ఊరంతా కూడా పచ్చగా, పాలవెల్లిలా కళకళలాడిపోతుంది... నిజం!"[55] అని ఉమ్మడి కుటుంబాలలో ఉన్న సంబంధబాంధవ్యాలును గురించి రచయిత్రి చక్కగా వర్ణించారు. నేటి సమాజంలో ఇటువంటి సంబంధాలు కరువైయ్యాయని, ఇటువంటి చక్కటి మానవీయ విలువలకు కథల ద్వారా సమాజాన్ని మేల్కొల్పాలనే ఉద్దేశంతో రచయిత్రి ఈ కథ ద్వారా వివరించారు.

..........................................................................................

55. మొగలిపువ్వు కథాసంపుటి - పుట 63